కర్నూలు । నంద్యాల
వార్త
29 ఆగష్టు 2023 మంగళవారం పేజీలు 4

# జగనన్నకు చెబుదాం - స్పందన వినతులపై శ్రద్ధ తీసుకోండి

**నంద్యాల, ఆగష్టు 28, ప్రభాతవార్త:** జగనన్నకుచెబుదాం స్పందన వినతులపై శ్రద్ధ తీసుకొని రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటినరీహాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసి తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్వో పుల్లయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ విత్ఇన్ ఎస్ఎల్ఏలో ఉన్న సర్వీసులు, సేవా సర్వీసులకు సంబంధించి ధరఖాస్తులు క్లియర్ చేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి బూత్‌సా ్థయి అధికారులతో రీసర్వ పకడ్బందిగా చేపట్టాలన్నారు. ప్రతి ఎలక్ట్రోరల్ అధికారి 1000 ఓటర్ల తొలగింపులను నియోజకవర్గ స్పెషల్ అధికారి 500 ఓటర్ల తొలగింపులను వెరిఫికేషన్ స్వయంగా పర్యవేక్షించి నివేదిక ఇవ్వాలన్నారు. ఈనెల 30 లోపల ఇంటింటి సర్వే పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలోని నలుమూలల నుండి వచ్చిన 185 అర్జీలు స్వీకరించారు. కొన్ని వినతులు శిరివెళ్ల మండలం చెన్నూరు నివాసి జేమ్స్ 2018లో రూ.1.80 లక్షలతో మీని గోకులం కట్టుకున్నాని ప్రభుత ్వం నుంచి ఇంత వరకు బిల్లు రాలేదని సమస్యను పరిష్కరించాలన్నారు. పొన్నాపురం కాలనీనికిచెందిన ఎండియు అపరేటర్లు రేషన్ డిస్ట్రిబ్యూషన్ చేయడానికి గత రెండునెలలుగా రెండుసార్లు తంబు పెట్టినప్పటికి డిస్ట్రిబ్యూషన్ అలస్యంగా జరుగుతుందని ఒక్కొక్క కార్డుదారునికి 15 నిమిషాలు పడుతుందని ఈసమస్యను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# వామ్మో..భౌ..భౌ

- కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు
- కుక్కలను నియంత్రించడంలో అధికారులు విఫలం
- గతంలో బాలుడిపై దాడి
- ఫీర్యాదుపై అధికారుల్లో స్పందన కరువు..దయాసాగర్
- కుక్కల బెడద తీరేదెన్నడో..?



2లో





**ఎమ్మిగనూరు క్రైం, ఆగష్టు 28 ప్రభాతవార్త:** కుక్కకాటుతో జనం విలవిల్లాడుతున్నారు. రాత్రిళ్లే కాదు..పగటి పూట కూడ కుక్క కనిపిస్తే జడుసుకుంటున్నారు. కుక్క కాటు వల్ల రోజు రోజుకు పెరుగుతున్న భాదితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ప్రతినిత్యం ఒకరిద్దరు గాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. నెలలు తరబడి సమస్య వెంటాడుతున్నప్పటికి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ముఖ్యంగా చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వీధి కుక్కలను పట్టివేసి ప్రజలను కుక్క కాటు భారీన పడకుండా కాపాడాలని పట్టణ ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# విచారణతో న్యాయం - ఎస్పీ కృష్ణ కాంత్

## స్పందన కార్యక్రమానికి 90 ఫిర్యాదులు



**కర్నూలు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 90 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) ఈశ్వర్ ఇన్ ఫ్రా వారి నుండి ఒక ఫ్లాట్ కొనుగోలు నిమిత్తం 10 లక్షలు ఇచ్చాము. కానీ ఫ్లాట్ కు సంబంధించిన డాక్యుమెంట్స్ అడిగినప్పుడు ఏదొ కారణం చెబుతూ మోసం చేస్తున్నారని , నేను టైలరింగ్ పని చేసి కూడబెట్టిన డబ్బుంతా స్థలం కొనుగోలు చేసానని గురుబ్రహ్మ నగర్ చెందిన సరోజ ఫిర్యాదు చేశారు. 2) ఏకాంబర మూర్తి నాకు లోన్ ఇప్పిస్తానని చెప్పి , సిబిల్ స్కోర్ తక్కువ ఉంది, లోన్ రావడం కష్టమేనని చెప్పి రూ. 1 లక్ష తీసుకుని నీకు సిబిల్ స్కోర్ పెంచి లోను ఇప్పిస్తానని , లోన్ ఇప్పించకుండా మోసం చేశాడని కర్నూలు , రేడియోస్టేషన్ దగ్గర ఉన్న ఇందిరమ్మ కాలనికి చెందిన కురువ నాగేంద్రుడు ఫిర్యాదు చేశారు. 3) పంచాయతీ రోడ్డు కు అడ్డంగా గోడ కట్టి బడి పిల్లలకు దారిలేకుండా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆస్పరి మండలం, పలుకూరు బండ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. 4) సర్వేయర్ కెవి సుబ్బారెడ్డి అనే వ్యక్తి నా పొలానికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా , సొంతంగా వచ్చి కొలిచి హద్దు రాళ్ళు ఏర్పాటు చేశారని ఓర్వకల్లు మండలం, నన్నూరు గ్రామానికి చెందిన ఫయాజ్ భాష ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత హామీ ఇచ్చారు. ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు.

# శ్రీశైలం మల్లన్నకు సహస్రదీపార్చనలు



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు28, ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సోమవారసేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.రాత్రి ఉభయదేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో సా ్వమిఅమ్మవార్ల ఉత్స వమూర్తులకు సహస్రదీపార్చన జరిపారు.ముందుగా ఉత్స వరులకు ప్రత్యేక అర్చనలు,హారతి పూజలు జరిపి తదుపరి వెయ్యి దీపాలు వెలిగించి దీపార్చన నిర్వహించారు.అనంతరం ఉభయదేవాలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్స వ సేవ జరిపారు.మల్లన్నకు అత్యంత ప్రీతికరమైన రోజుగా భావించే సోమవారం స్వామిఅమ్మవార్లకు శాస్త్రబద్ధంగా దీపార్చన, వెండిరథసేవలు నిర్వహించడం ఆనవాయితి.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ లవన్న,అదికారులు,అర్చకస్వాములు,వేద,ఆగమ పండింతులు పాల్గొనా ్నరు.

# పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదు

**- రూ.24.52 కోట్లు జగనన్న విద్యాదీవెన కింద తల్లుల ఖాతాలో జమ - జిల్లా కలెక్టరు**



**నంద్యాల, ఆగష్టు 28, ప్రభాతవార్త:** పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్‌జిలాని సమూన్ జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హాబిబుల్లాలు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరిలో జగనన్న విదా ్యదీవెన కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద విడియోకాన్ఫరెన్స్ హాల్‌లో వర్చువల్‌గా తిలకించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,44,336 మంది విద్యార్థు ల తల్లుల ఖాతాల్లో రూ.680.44 కోట్లు కంప్యూటర్ బటన్‌నొక్కి నేరుగా తల్లుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద ఈఏడాది 2023 ఏప్రిల్, జూన్ త్రైమాషికానికి 34,879 మంది విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.24.58 కోట్లు జమచేశామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5981 మంది విద్యార్థుల తల్లులకు రూ.4.16 కోట్లు, బనగానపల్లె 6238 మంది కి రూ.4.36 కోట్లు, డోన్‌లో 5.002 మంది తల్లులకు రూ.3.39 కోట్లు, నందికోట్కూరులో 5,316 మందికి రూ.3.54 కోట్లు, నంద్యాల్లో 5,896 మందికి రూ.4.60 కోట్లు, పాణ్యంలో 1803 మందికి రూ.3.14 కోట్లు వారు తల్లుల ఖాతాల్లో జమచేశామన్నారు. కార్యక్రమంలో చెక్కు పంపిణి చేశారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ డిడిలు చింతామణి, లక్ష్మీదేవి, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టరు సునీత అమృత్ రాజు, బెస్తసంఘ డైరెక్టరు గిరిబోయిన చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృత్‌రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జగనన్న విద్యా దీవెన పొందిన 38,597 మంది విద్యార్థులు

**35,074 మంది తల్లుల ఖాతాల్లో రూ.25 కోట్లు జమ : జిల్లా కలెక్టర్ డా.జి.సృజన**



2లో

**కర్నూలు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఏప్రిల్ 2023 నుండి జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాన్ని జిల్లా వ్యాప్తంగా అర్హులైన 38,597 మంది విద్యార్థులకు సంబంధించిన 35,074 మంది తల్లుల ఖాతాల్లో రూ.25 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. సోమవారం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఏప్రిల్ 2023 నుండి జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరి నుంచి బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.జగనన్న విద్యా దీవెన ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, కర్నూల్ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్సీ మధుసూదన్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ , నగర మేయర్ బి.వై.రామయ్య, డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి, కెడిసిసి చైర్మన్ ఎస్ వి విజయ మనోహరి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, ,బిసి వెల్ఫేర్ ఆఫీసర్, ఇంఛార్జి ఐసిడిఎస్ పిడి వెంకట లక్ష్మమ్మ, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస రావు, మైనారిటీ సంక్షేమ అధికారి సభిహా పర్వీన్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు వీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఒక విద్య ద్వారానే ఉన్నత స్థాయికి ఎదుగుతారనే నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యకి సంబంధించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పేద విద్యార్థులు వారికి నచ్చిన కోర్సుల్లో విద్యను అభ్యసించడమే కాక,

# రాయలసీమలో త్వరలో కరువు యాత్ర -బైరెడ్డి

**- డొక్కల కరువు వచ్చే ప్రమాదం పొంచివుంది**

**- కరువపై జగన్ కేంద్రం వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్ళాలి**



**నందికొట్కూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ కరువు కోరల్లో చిక్కుకొని ప్రజా జీవనం స్థంభించి పోయిందని దీనిపై సెప్టెంబర్‌లో రాయలసీమలో కరువు యాత్ర చేపడుతున్నామని సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన స్వగృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో బైరెడ్డి మాట్లాడుతు కర్ణాటక అప్పర్‌భద్ర డ్యాం నిర్మించడం వలన మనకు నీటి కష్టాలు తప్పవని, గుండ్రేవుల పూర్తి అయి వుంటే కెసికి నీటి ఇబ్బంది ఉండేదికాదని, అధికారులు వర్షాధార పంటలు వేసుకోవాలని చెప్పడం దారుణమని, వర్షాలు పడక పోవడంతో అప్పుడే సంగమేశ్వర దేవాలయం బయటపడిందని, తీగెల వంతెన వద్దని బ్రిడ్జి కం బ్యారేజి కట్టమంటే పట్టించుకోలేదని పాలకుల నిర్లక్ష్యంతో డొక్కల కరువు వచ్చే ప్రమాదం పొంచివుందని ఆయన ఆంధోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఐఎబి మీటింగ్‌లో రైతుల గురించి మంత్రులు కాని, ఎం.పి.లు, ఎమ్మెల్యేలు కాని రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి ఒక్కమాట మాట్లాడక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. రైతులు వర్షాలు లేక పంటలను దున్నివేస్తున్నారని దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అఖిలపక్ష పార్టీలను ప్రదాని వద్దకు తీసుకెళ్ళాలని, రాయలసీమలో ఏర్పడిన కరువుపై దేశ ప్రధాని ఏమి చర్యలు తీసుకుంటారో తెలుసుకుందామని, రాయలసీమ కోసం రెండు పంపుల ద్వారా నీరు ఇస్తామని చెప్పడం దారుణమని, బోర్లు ఎండి పోయాయి, ఉన్న నీరు విధ్యుత్ ఉత్పత్తికి వాడుకోవడంతో తాగు నీటికి సాగునీటికి ఇబ్బంది కరంగా మారిందని, శ్రీశైలం ప్రాజెక్టు వ్యాపార కేంద్రంగా మారిందని, విధ్యుత్‌ను తయారు చేయడం దానిని అమ్మి, అధికంగా విధ్యుత్ చార్జీలు వసూలు చేయడం జరుగుతున్నదన్నారు. కర్ణాటక ప్రాజెక్టులను నిర్మిస్తు జలచౌర్యానికి పాల్పడుతున్నదని భవిషత్తులో రాయలసీమలో తాగడానికి చుక్క నీరు కూడ దొరకదని ఆయన ఆంధోళన వ్యక్తం చేశారు. రాయలసీమలో ఏర్పడుతున్న పరిణామాలపై ప్రజలను చైతన్య పరచి పాలకులను నిలదీసేలా కరువవు యాత్ర చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటిసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎస్‌కేడీ కాలనీలో చైన్‌స్నాచింగ్

**- వాకింగ్‌కు వెళ్లి వస్తున్న మహిళ మెడలో చైన్‌ను లాక్కెళ్లిన దుండగులు**

**- విచారణ చేపట్టిన టూటౌన్ పోలీసులు**





**ఆదోనిటౌన్, ఆగస్టు28, ప్రభాతవార్త ;** పట్టణంలోని ఎస్కెడీ కాలనీలోని పిరమిడ్ కేంద్రం వద్ద ఓ మహిళ వాకింగ్‌కు వెళ్లి తిరిగొస్తుండగా ఇద్దరు దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వెంకన్నపేటకు చెందిన నాగరత్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగా నాగరత్నమ్మ వాకింగ్‌కు వెళ్లిందని, సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగొస్తుండగా పిరమిడ్ కేంద్రం వద్ద దుండగులు కాపుకాసి ఒక్కసారిగా ఆమె మెడలో చైన్ లాక్కొని బైకుపై ఉడాయించారని తెలిపారు. అయితే నాగరత్నమ్మ మెడలో దుండగులు చేయి వేసిన వెంటనే దుండగుడి చేయి ఆమె పట్టుకోవడంతో దుండగులకు సగం చైన్ లాక్కెళ్లారన్నారు. మొత్త చైన్ ఆరు తులాలు ఉందని, అందులో సగం చైన్ రెండున్నర తులాలు బంగారు చైన్, రెండు తాళిబొట్లు, గుండ్లను లాక్కెళ్లారని తెలిపారు. వెంటనే ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు దుండగులను పట్టుకోవడానికి ప్రయత్నించగా బైకుపై వేగంగా తప్పించుకున్నట్లు తెలిపారు. వెంటనే ఆమెతో పాటు భర్త టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు, సీఐ వెళ్లి పరిశీలించారు. అలగే సీసీ ఫుటేజీలను పరిశీలించి విచారణ చేసుత ్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బయటకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలతో వెళ్లరాదని, ఒకవేళ వెళితే తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఓ మహిళపై చైన్ స్నాచింగ్ జరిగింది. ఈ విషయంపై టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ దృష్టికి తీసుకెళ్లగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

# తెలుగుకు వెలుగు .. గిడుగు..

**:-అచ్చ తెలుగు చిచ్చర పిడుగు..గిడుగు..**

**:-వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు..**

**:-జనరంజక సాహిత్యం భాషకు ప్రాణం..**

**:-నేడు తెలుగు భాష దినోత్సవం..**

**గిడుగు వెంకట రామ్మూర్తి 161వ జయంతి..**




2లో



**కోసిగి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** "దేశ భాషలందు తెలుగు లెస్సా అన్నాడు ఓ మహాకవి.. తెలుగు భాషకు మూలం సంస్కృతం.. దాని నుండి పుట్టినదే తెలుగు.. అన్ని భాషల్లోకెల్లా తెలుగుభాష మాట్లాడడం అత్యంత కష్టతరమని చాలామంది మేధావులు ఒప్పుకున్న నిజం.. అయితే తెలుగు భాషకు అంతటి గుర్తింపు తెచ్చింది గిడుగు వెంకట రామ్మూర్తి"..

""ప్రతి సంవత్స రం ఆగస్టు 29వ తేదీని తెలుగు భాషా దినోత్స వంగా జరుపుకుంటున్నాము.. కారణం గ్రాంధిక భాషను పండిత జన చెరనుంచి పామర జనులకు చేరువేసే దిశగా నిరంతరం అవిరళ కృషి చేసిన తెలుగు భాషోద్యమ స్ఫూర్తి దాత గిడుగు రామమూర్తి పంతులు.. ఈయన జయంతినే రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్స వంగా గుర్తించింది"""..

గిడుగు రామ్మూర్తి 1863 ఆగస్టు 29వ తేదీన శ్రీకాకుళం జిల్లా ముఖలింగం దగ్గరలో గల పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించారు..అంత వరకు గ్రాంధిక భాషలో ఉన్న వచనం గిడుగు రామ్మూర్తి ద్వారా నిత్య వాడుక భాషలోకి తీసుకు రాబడి తెలుగు భాష మాధుర్యం సామాన్య ప్రజానీకానికి చేరువ చేయబడింది.. తద్వారా పండిత జన సమూహాలకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకత, అర్హత కలిగిన ప్రతి వారి ముంగిటకు చేరింది.. తన తండ్రి వీర్రాజు రెవెన్యూ అధికారిగా పనిచేయడంతో రామ్మూర్తి 1875 వరకు ఆ ఊరిలోనే ప్రాథమిక విద్య సాగించాడు..కాగా తండ్రి బదిలీపై చోడవరం వెళ్లిన తరువాత తండ్రి అక్కడే మరణించడంతో కాల క్రమేణ చదువును పూర్తి చేసుకుని పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో కేవలం రూ.30ల జీతానికి ఉపాధ్యాయునిగా చేరారు.. ఇతనికి అప్పటికే తల్లి, ఇద్దరు అక్కా, చెలెళ్లు ఉన్నారు..అనంతరం ఈయన 1886లో ఎఫ్ఎ, 1894లో బిఏ పూర్తి చేసారు..ఆ తరువాత రామ్మూర్తికి కళాశాలలో తరగతులు చెప్పే అవకాశం కలిగింది..ఇదిలా ఉండగా అడవుల్లో ఉండే వారికి చదువు చెప్పాలని కోరిక పుట్టింది.. దీంతో తెలుగు, సవరభాష రెండూ వచ్చిన వ్యవహారకర్తను ఇంట్లోనే పెట్టుకుని రామమూర్తి సవర భాషను నేర్చుకున్నారు.. అక్కడి నుండి సవరభాషలో పలు పుస్తకాలు రాసి, సొంత ఖర్చులతో స్కూల్స్ స్థాపించి అధ్యాపకులను ఏర్పాటు చేసి వారికి జీతాలు చెల్లిస్తూ సవర పిల్లలకు చదువులు చెప్పించేవారు..ఈయన కృషిని గుర్తించి మద్రాసు ప్రభుత్వం 1913లో రామ్మూర్తికి 'రావుబహదూర్' బిరుదుతో సత్కరించింది.. ఆ తరువాత 1931లో ఇంగ్లీసులో సవరభాష వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కళాశాలను స్థాపించారు.. 1906 నుంచి 1940 వరకు దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు ఆయన తెలుగు భాషాభివృద్ధికి చేసిన అవిరళ కృషి అజరామరం.. తెలుగు అను పత్రిక ద్వారా వ్యవహారిక భాషపై ప్రచురించిన పలు శీర్షికలు, కథనాలు నేటికీ తెలుగు భాషా పరిరక్షణలో ప్రధాన భూమిక వహిస్తున్నాయి.. ప్రాచీన సంస్కృత భాష జాలం నుంచి విడివడి ప్రాథమిక స్థాయి నుంచి మాతృభాషపై పట్టు సాధించాలని, జాతి పటిష్టతలో వ్యవహారిక భాష ప్రధాన పాత్ర వహిస్తుందని వ్యవహారి కోద్యమానికి రూపకల్పన చేసిన వారు గిడుగు రామ్మూర్తి పంతులు..ఇలా తన మాతృభాష తెలుగుపై ఉన్న మక్కువతో గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు ఎనలేని గుర్తింపు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి.. ఆదర్శప్రాయుడుగా నిలిచారు.. అటువంటి మహోన్నత వ్యక్తి, రచయిత గిడుగు 1940లో తుదిశ్వాస విడిచే వరకు తెలుగు భాష అభివృద్ధి కోసమే కలవరించాడు..కాగా గిడుగు రామ్మూర్తి పుట్టిన రోజును తెలుగు భాషా దినోత్స వంగా రాష్ట్ర ప్రభుత్వం జరుపుకోవడం ఆయనకు తెలుగు వారు ఇచ్చే జాతి గౌరవం..

# వామ్మో..భౌ..భౌ

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మిగనూరులో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కుక్కలు ఎవరిని పడితే వారిని చిన్న, పెద్ద, ముసలి, ముతక అని తేడా లేకుండా దాడి చేసి గాయపరచడంతో ఆసుపత్రికి పరుగులు తీయాల్సిన పరిస్థితి ఎమ్మిగనూరులో ఏర్పడింది. ముఖ్యంగా వీధుల్లో చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. అలాంటి వారిపై కుక్కలు ఒకసారిగా దాడి చేసి ముఖం, కాళ్లు, చేతులు, పొట్ట భాగాలపై కరవడం, ఘాట్లు పడేలా రాక్కడంతో రక్తస్రావ గాయాలపాలవుతున్నారు. దీంతో పిల్లలు ఏడుస్తూ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కుక్కలను వెంటపడి కొట్టే పరిస్థితి వచ్చినప్పటికీ అవి దొరక్కుండా పరుగులు తీస్తున్నాయి. పిల్లల తల్లిదండ్రులు హూటా హుటిన బిడ్డలను తీసుకొని ఆసుపత్రికి వెళ్లి కుక్క కాటుకు టీకాలు, గాయాలకు మందులు వేయించుకొని పిల్లలను జాగ్రత్తగా మరో మారు కుక్కల దాడికి పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే పలు వీధుల్లో కుక్కలు గుంపులుగా వాహనాలపై వెళ్లే వారిపై అరుస్తూ, దాడులు చేస్తున్నాయి. కొంతమంది వాహన దారులు భయాందోళనతో వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న పలు వాహనాలను ఢీకొట్టడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలు ఎక్కడపడితే అక్కడ వీధుల్లో భారీ సంఖ్యలో గుంపులుగా చేరి వచ్చిపోయే వారిపై అరుస్తూ కరవడం చేస్తున్నాయి. ఇక చీకటి పడితే పట్టణంలోని సందుల్లో వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు ఎక్కడ కుక్కలు ఉన్నాయో లేదో చూసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రుల్లో ద్విచక్ర వాహనంలో గాని, నడుచుకుంటూ గాని ఒంటరిగా వెళ్లాలంటే కుక్కలు వెంటాడుతున్నాయి. మునిసిపల్ అధికారులు కొన్ని వీధుల్లో మాత్రమే కుక్కలను పట్టి వదిలేసి కుక్కలను పూర్తిగా అదుపు చేయడంలో మునిసిపల్ అధికారులు పూర్తిగా విఫలమైయ్యారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**– ప్రాణాంతకంగా మారుతోన్న రేబిస్**

కుక్కల నుంచి మనుషులకు సోకే అత్యంత ప్రమాదకర వ్యాధి రేబిస్. ఈ వ్యాధి కారక వైరస్ కుక్క కరిచినప్పుడు శరీరంలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థ ద్వారా మెదడుకు చేరి ప్రాణాంతకంగా మారుతుంది. కుక్కలు కరిచిన రెండు, మూడు నెలల తర్వాత, ఒక్కోసారి ఏడాది తరువాత కూడా రేబిస్‌తో మరణించిన దాఖలాలున్నాయని వైద్యనిపుణులు తెలుపుతున్నారు. శరీరంలో కుక్క కరిచే ప్రాంతాన్ని బట్టి ఆ వైరస్ సోకే వ్యవధి ఉంటుందని వైద్యులు అంటున్నారు. చెత్త కుప్పల వద్ద జరిగే ఘర్షణల్లోనే ఒక కుక్క నుంచి మరో కుక్కకు కూడా రేబిస్ వ్యాప్తి చెందుతోందని గుర్తించినట్లు వైద్యులు చెబుతున్నారు.

**– వీధి కుక్కలను అరికట్టడంలో అధికారులు విఫలం**

ఎమ్మిగనూరు పట్టణంలో విచ్చలవిడిగా పెరుగుతున్న కుక్కల సంఖ్యను నియంత్రించడంలో పురపాలక సంస్థ విఫలమైయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. శునకాల నియంత్రణ మునిసిపల్ అధికారుల భాద్యల అయినప్పటికి ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది ఒక ప్రాంతంలో కుక్కలను పట్టి మరోక ప్రాంతంలో వదిలేస్తుండటంతో సమస్య మరింత జఠిలంగా మారుతోందని ఆరోపిస్తున్నారు. కుక్కల ప్రాణం తీసే అధికారం అధికారులకు లేకపోయినా కనీసం సంతానోత్పత్తినైనా నియంత్రించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**– కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు**

ఎమ్మిగనూరు పట్టణంలోని 18వ వార్డులో ఐదు సంవత్సరాల చిన్నారి సంగీత పై వీధి కుక్కలు దాడి చేశాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న సంగీతపై కుక్కలు గుంపులుగా వచ్చి ఒక్కసారిగా దాడి చేశాయి. ఆ చిన్నారి అరుపులు విన్న కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూస్తే ఆ చిన్నారిని కింద పడేసి దాడి చేస్తుండగా, వెంటనే కుక్కను తరిమేందుకు ప్రయత్నం చేయగా మరో ఇద్దరు మహిళలపై కూడ దాడి చేయడం జరిగింది. ఈ ఘటనలో చిన్నారి సంగీతతో పాటు మరో ఇద్దరు మహిళలకు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో కుక్కల దాడిలో గాయపడిన చిన్నారిని తల్లిదండ్రులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లి ప్రాథమిక వైద్యం చేయించారు. ఇలాంటి సంఘటనలు పట్టణంలో చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

**– ఫిర్యాదుపై అధికారుల్లో స్పందన కరువు..దయాసాగర్ టిడిపి కౌన్సిలర్**

ఎమ్మిగనూరు మునిసిపల్ కార్యాలయం నందు ఏర్పాటు చేసే ప్రతి కౌన్సిల్ సమావేశంలో అధికారులకు కుక్కల సమస్యలపై ఎన్నో సార్లు ప్రశ్నించడం జరిగింది. అయినప్పటికి అధికారులు ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం వలనే ముగతిపేట కాలనీకి చెందిన సూఫియాన్ అనే బాలుడిపై గత కొన్ని నెలల క్రితం కుక్కల దాడి జరిగింది. అయితే నేడు 18వ వార్డుకు చెందిన ఐదేళ్ల చిన్నారి సంగీతపై కుక్కలు దాడి చేయడం ఇది చాలా బాధకరం అని టిడిపి కౌన్సిలర్ విజిప దయాసాగర్ మునిసిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు మునిసిపాలిటీ అంటేనే రాష్ట్రంలో ఒక పేరు ఉన్నటువంటి మునిసిపాలిటి కానీ ఈరోజు చాలా దారుణమైన పరిస్థితిలో ఉందన్నారు. కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి సంగీతకు వైద్య ఖర్చులుకూడా మునిసిపాలిటీ అధికారులే చెల్లించాలని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని టిడిపి తరుపున కోరడమైనది.

## పట్టణ ప్రజల దాహార్తిని తీర్చండి

**ఆదోని రూరల్,ఆగస్టు 28,ప్రభాతవార్త :** పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నీలకంతప్ప అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో పట్టణ నీటి సమస్యపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నీలకంతప్ప మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల చరిత్ర గల ఆదోని మున్సిపాలిటీకి అధికారుల నిర్లక్ష్యం వల్ల పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పట్టణంలోని 42వార్డులకు తాగునీరు సరఫరా చేసేందుకు 2004లో బసాపురం గ్రామం వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించి ప్రజలకు నీటి ఎద్దడి నివారించగలిగారని అయితే ప్రస్తుత ఆదోని మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ట్యాంకుకు పగుళ్లు వచ్చి నీరు లీక్ అవ్వడం ద్వారా మంచినీరు వృధా జరుగుతుందన్నారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ స్పందించి అధికారులపై విచారణ జరిపించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి పట్టణ ప్రజలకు రెండ్రోజులకోసారి నీరు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షులు దిలీప్‌దోక,రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు,కాంగ్రెస్ కార్యదర్శి సాయినాథ్,యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్,శ్రీనిత్,రాము తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలలో రక్తహీనతపై అవగాహన

**మద్దికెర,ఆగస్టు 28,ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ నాగేష్ ఆదేశానుసారం సోమవారం స్థానిక ఎంపిపి సెంట్రల్ స్కూల్ నందు పిల్లలకు హెల్త్‌స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ భాషా విద్యార్థులకు రక్తహీనత–వ్యక్తిగత పరిశు భ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని,విటమిన్ సి ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని,భోజనానికి ముందు తర్వాత కాఫీ,టీ తాగరాదని సూచించారు. ఐరన్ మాత్రలు వాడటానికి ముందు నులిపురుగుల నివారణ మాత్ర తీసుకోవాలని,బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకుండ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలని,వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలని,భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్,లక్ష్మీ, సచివాలయ హెల్త్ సెక్రటరీ సువర్ణ,ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ,సూర్య నారాయణ,ప్రకాష్ రావు,ఆశా కార్యకర్తలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా బృందం ఆద్వర్యంలో పంటపొలాలు పరిశీలన

**ఆలూరు,ఆగస్టు 28,ప్రభాతవార్త :** సిపిఐ జిల్లా బృందం ఆద్వర యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లిలేటిశెట్టి,నాయకులు సోమవారం ఆలూరు,హులేబీడు,తుమ్మల బీడు,హత్తిబెళగల్ గ్రామాల్లో పర్యటించి పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య,మద్దిలేటిశెట్టిలు మాట్లాడుతూ రైతుల యొక్క ఆవేదన పాలకులు, ప్రభుత్వ అధికారులకు పట్టలేదని విమర్శించారు. ప్రధాన పంటలు పత్తి,వేరుశనగ ఇతరిత్ర పంటలు తీవ్ర వర్షాభావ పరిస్థితి కారణంగా అన్ని మొలక దశలోనే ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికే రైతులు,కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. కావున జిల్లా కలెక్టర్,జిల్లా వ్యవసాయాధికారులు జిల్లా వ్యాప్తంగా పంటల పరిశీలన చేసి రైతులు వేసి ప్రధాన పంటలు వేరుశనగ,పత్తి పంటలకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించి వలసలను నివారించి రైతులు,రైతు కూలీలను ఆదుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ కె భూపేష్,మండల కార్యదర్శి రామాంజనేయులు,రైతుసంఘం తాలుక నాయకులు చంద్రకాంత్‌రెడ్డి,ఓతురప్ప,ఏఐటియుసి తాలుక అధ్యక్షులు శివ,మొలగవల్లి సిపిఐ గ్రామ కార్యదర్శి రంగన్న,ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మాట నిలుపుకోవాలి

**ఆదోని,ఆగస్టు 28,ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ,కార్మికులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కె అజయ్‌బాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ముందుగా శ్రీనివాససర్కిల్ ప్రాంతంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమాస్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి పట్టణ కార్యదర్శి వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు,రైతుసంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీరెడ్డిలు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా సిఎం జగన్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని నమ్మబలికి మోసం చేశారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ధరల కనుగుణంగా రూ.26000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా విపత్తులో పనిచేసిన కార్మికుల సేవలను గుర్తించి పర్మినెంట్ చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ అధ్యక్షులు భీమేష్,ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్,సిపిఐ పట్టణ,మండల కార్యదర్శులు సుదర్శన్,కల్లుబావి రాజు, లక్ష్మీనారాయణ,షేక్షావలి,సోమన్న,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్‌బాబు, జయరాజు,షేకన్న,శాంతప్ప, మహేష్,నాగరాజు,నాగమ్మ,సుశీలమ్మ,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలను కరువు జిల్లాగా ప్రకటించాలి

**కోవెలకుంట్ల,ఆగస్టు 28,ప్రభాతవార్త :** వర్షాభావ పరిస్తితులు స్పష్టముగా కనిపిస్తున్నందున నంద్యాల జిల్లా కరువుయ జిల్లాగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్‌బాబు కోరారు. జీపు జాత ను పురస్కరించుకుని కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీసెంటరులో సిపిఐ నాయకుల ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను వివరించారు. ఈకార్యక్రమమలో శివబాలకృష్ణ, భాష, కుళ్లాసా వ్మిబాష, గోపాలకృష్ణలు పాల్గొన్నారు.

## తరగతి గదుల్లో సెల్‌ఫోన్ నిషేధం

**– రాష్ట్ర విద్యాశాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ**

**నంద్యాల విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్తః** రాష్ట్రంలోని అన్ని జిల్లాలో అన్ని క్యాటగిరి పాఠశాలల్లో తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లను నిషేధిస్తు రాష్ట్ర కమిషనరు సురేష్‌కుమార్ ఉత్తర్వులు ఆర్‌సిఈఎస్ఈ 02/828/2023 మేరకు ఉత్తర్వులు సోమవారం జారీచేశారు. అందులోని అంశాల మేరకు ఇక నుంచి ఏ ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను తరగతి గదుల్లోకి తీసుకెళ్లరాదు. బోధన సమయంలో సొంత ప్రయోజనాలకోసం వ్యక్తిగతంగా మొబైల్ ఫోన్లను ఉపయోగించడం నిషేధించబడింది. బోధన కోసం ఉపయోగించాల్సి వస్తే లెసన్‌ప్లాన్‌లో ఎందుకు ఉపయోగిస్తున్నారో రాసి హెచ్‌ఎం సంతకంతో వినియోగించుకోవాలి. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు ఎండిఎం బోధన సమయానికి ప్రారంభానికి ముందే ఉదయం 9.30 గంటలకు ముందు సాయంత్రం 4 గంటల తరువాత వినియోగించుకోవాలి. ఈ అదేశాలను పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ వినియోగ విధానాన్ని ఉల్లంఘిస్తే మొదటిసారి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయురాలు మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది. రెండవ నేరం కింద మొబైల్ ఫోన్ లాక్కొని ఎంఇఒకు విషయం తెలియపరిచి వివరణ ఇచ్చి సెల్‌ఫోన్ తీసుకోవాలి. మూడవ సారి అలాగే జరిగితే మొబైల్ ఫోన్ స్వాదీనం చేసుకొని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపబడుతుంది. తప్పుచేసిన ఉపాధ్యాయులు డిఇఒకు వివరణ ఇచ్చి ఆ వివరణ సర్వీసు పుస్తకంలో నమోదు చేసి తమ మొబైల్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వమే ఈవిధమైన నిబంధనలు విధించడంతో ఉపాధ్యాయుల్లో ఓ విధానమైన అసంతృప్తి నెలకొందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

## స్పందన అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

**ఆదోని రూరల్,ఆగస్టు 28,ప్రభాతవార్త :** స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి గోవింద్ సింగ్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో పూర్తయ్యే సమస్యలు డివిజన్ స్థాయి వరకు వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారాలపై నిర్లక్ష్యం చూపొద్దని సూచించారు. నాణ్యతతో గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటి ్ట పరిస్థితుల్లో బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండ స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య,డిఎల్‌డిఓ నాగేశ్వరరావు,బిసి వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, ఏడిఎ గిరీష్‌కుమార్‌రెడ్డి,గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్,ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చేతన్ ప్రియా,ఎస్‌సి వెల్ఫేర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునికరించిన ఎలక్షన్ సెల్ కార్యాలయంను ప్రారంభించిన కలెక్టర్ డా.సృజన



**కర్నూలు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** కలెక్టరేట్ మరమ్మతులో భాగంగా ఆధునికరించిన ఎలక్షన్ సెల్ కార్యాలయం ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించారు.సోమవారం కలెక్టరేట్ సముదాయంలో ఆధునికరించిన ఎలక్షన్ సెల్ కార్యాలయం ను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ మరమ్మతులో భాగంగా తొలుత ఎలక్షన్ సెల్ కార్యాలయాన్ని ఆధునికరించి ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. నూతనంగా నిర్మించిన కార్యాలయ గదులను పరిశీలిస్తూ చాలా చక్కగా ఆధునికరించారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. డిఆర్‌ఓ నాగేశ్వరరావు, ఎన్నికల సూపరిటెండెంట్ మురళి, ఎన్నికల సెల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## జగనన్న విద్యా దీవెన పొందిన 38,597 మంది విద్యార్థులు

**(మొదటి పేజీ తరువాయి) :** వారికి ఎటువంటి ఆర్థిక కష్టాలు రాకుండా ప్రభుత్వమే వారి ఫీజును పూర్తి స్థాయిలో ఫీ రీయింబర్స్మెంట్ ద్వారా చెల్లిస్తున్నారని అన్నారు. అదే విధంగా జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి తదితర పథకాలతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కర్నూలు జిల్లాలో జగనన్న విద్యా దీవెన క్రింద 38597 మంది విద్యార్థులకు సంబంధించి 35,074 మంది తల్లుల ఖాతాలలో రూ.25 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు. ఇందులో ఎస్సీ సంక్షేమం ద్వారా 9543 మంది విద్యార్థులకు రూ.6.27 కోట్లు, ఎస్టీ సంక్షేమం ద్వారా 720 మంది విద్యార్థులకు రూ.51 లక్షలు, బీసీ సంక్షేమం ద్వారా 20,594 మంది విద్యార్థులకు రూ.12.89 కోట్లు, ఈబిసి సంక్షేమం ద్వారా 1877 విద్యార్థులకు రూ. 1.63 కోట్లు, కాపు సంక్షేమం ద్వారా 745 మంది విద్యార్థులకు రూ.55 లక్షలు, మైనారిటీ సంక్షేమం ద్వారా 4991 మంది ముస్లిం విద్యార్థులకు రూ.3.07 కోట్లు, క్రిస్టియన్ సంక్షేమం ద్వారా 127 మంది విద్యార్థులకు రూ.92 లక్షలు లబ్ది పొందారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద ఏప్రిల్ 2023 నుండి జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి స్థాయి ఫీ రీయింబర్స్మెంట్ రూ.25 కోట్ల మెగా చెక్కును అందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఈక్రాప్ బుకింగ్ తప్పక నమోదు చేసుకోండి

**హొళగుంద,ఆగస్టు 28,ప్రభాతవార్త :** మండలంలో ఉన్న ప్రతిఒక్క రైతు ఈక్రాప్ బుకింగ్ తప్పక నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆనంద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే పంటల ఇన్సూరెన్స్ తదితర పథకాలు లబ్ది పొందుతారన్నారు. ఈక్రాప్ బుకింగ్‌కు ఆధార్,పొలం పాస్‌పుస్తకం,1బి, ఆధాక్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకుని తమ తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రంలో తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. చాలామంది రైతులు ఈక్రాప్ బుకింగ్ చేసుకోలేదని ఇలాగైతే ప్రభుత్వాల నుండి వచ్చే ఫలాలు అందవన్నారు. కావున ప్రతిరైతు తమ పరిధిలో ఉన్న ఆర్‌బికె కేంద్రాల్లో పంటనమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని 20గ్రామాల్లో ఇప్పటివరకు 8148.72ఎకరాల పంటనమోదు చేసినట్లు తెలిపారు.

## 'ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు'

**కొలిమిగుండ్ల, ఆగష్టు 28, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జిల్లా నాయకులు రమేష్‌బాబు, శివ బాలక్రిష్ణ విమర్శించారు. సోమవారం సిపిఐ పార్టీ జీపు జాత కార్యక్రమం కొలిమిగుండ్లకు చేరిన సందర్భంగా మండల ఏఐటియుసి కార్యదర్శి రామక్రిష్ణ, సిపిఐ కార్యదర్శి సూరి ఆధ్వర్యంలో అర్‌టిసి బస్టాండు ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. త్వరలో డోన్ పట్టణంలో చేపట్టనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన వివిధ రకాల ధరలను, చార్జీలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## కిడ్డీస్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**ఆదోని రూరల్,ఆగస్టు 28,ప్రభాతవార్త :** ఫీజుల దోపిడీ చేస్తున్న కిడ్డీస్ స్కూల్ గుర్తింపును రద్దుచేసి క్రిమినల్ కేసులను నమోదు చేయాలని ఆర్‌యుఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి స్పందనలో ఏఒకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్డీస్ స్కూల్ ప్రభుత్వం కళ్లుగప్పి అధిక ఫీజులు వసూలు చేసి చరిత్ర సృష్టిస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వ నియామాల కంటే ఎక్కువ అడ్మిషన్లు తీసుకోవడం,సెలవుదినాల్లో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు ఒత్తిడికి గురి కావడం జరుగుతుందన్నారు. విద్యార్థి సంఘాలు పలుమార్లు వినతిపత్రాలు అందచేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్,ఇదుర్ భాష,జలంధర్,బడిషావలి,సురేష్,హరి,అనిల్, మాలిక్, దూద్‌వలి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు,ఆగస్టు28,ప్రభాతవార్త :** శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)సోమవారంనాడు శ్రీ వి.గణేష్,జిల్లెళ్ళమూడి వారిచే దేవి వైభవం పై ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ ప్రవచన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయనృత్యం,వాయిద్య సంగీతం,భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## గర్భస్త లింగనిర్ధాన గురించి మాటలరూపం, చేతలరూపం అబార్షన్ చేయరాదు

**కర్నూలు అర్బన్, ఆగష్టు 28, ప్రభాతవార్తః** ఈరోజు పిసి అండ్ పిఎన్‌డిటి సబ్ డిస్ట్రిక్ లెవెల్ కమిటీ మీటింగ్ నోడల్ ఆఫీసర్ మరియు పిసి అండ్ పిఎన్‌డిటి కర్నూలు డివిజన్ చైర్ పర్సన్ డా.వై ప్రవీణ్‌కుమార్ జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మీటింగ్ జరిగింది. డా.ప్రవీన్‌కుమార్‌మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్‌లో ఉండే స్కానింగ్ సెంటర్, కొత్త రిజిస్ట్రేషన్ రెన్యూవల్‌కు అప్లయి చేసుకున్నవాటిని ప్రొగ్రామ్ ఆఫీసర్ తనిఖీలు చేసి వారి యొక్క పత్రాలు సరిగా వున్నచో వాటి ఇన్‌స్పెక్షన్ రిపోర్టును జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి తదుపరి అమోదం కొరకు సమర్పించేదమని తెలిపారు. గర్భస్త లింగ నిర్ధారణ గురించి ఏవరికి మాటల రూపంలో గానీ, చేతల రూపంలో గానీ, చెప్పరాదని అంతేకాకుండా అబార్షన్ చేయరాదని గర్భవతులు, స్కానింగ్‌కు వచ్చినప్పుడు వారికి లింగ ఎంపిక నిర్ధారణ గురించి చెప్పరాదు. అలా చెప్పిన యెడల పిసి అండ్ పిఎన్‌డిటి చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని తెలిపారు. డివిజన్‌లో ఉన్నటువంటి స్కానింగ్ సెంటర్ నందు తనిఖీలు నిర్వహించాలని జూనియర్ కళాశాలలో, పాఠశాలల్లో అడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ తీర్మాణం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో పిడియాట్రిషియన్ డా.ప్రకాష్ ఆనంద్, గైనకాలజిస్టు డా.నర్మద, డెమో ప్రమీళాదేవి, ఎపీపీ సుబ్బయ్య, ఎన్‌జిఓలు రాయపాటి శ్రీనివాసులు, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు ఎన్‌జిఓలు, డిపిహెచ్‌ఎన్‌ఓ మీనాక్షి, డివై డివిజనల్ డెమో, పిఎన్‌డిటి ప్రొగ్రామ్ కన్సల్‌టెంట్ సుమలతలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ భీమా రూ.10వేలు పంపిణి

**ఆత్మకూరు ఆగష్టు28,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించే విదంగా వైఎస్సార్ బీమా పథకంను అమలు చేయడం జరిగిందని నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మున్సిపాలిటిలో 14వ వార్డు కౌన్సిలర్ రాజపల్లి మహ్మద్‌హుసేన్, వైసిపి యువ నాయకులు మహెబుబ్‌బాషా, పాన్ బాషలు తెలిపారు. సోమవారం వార్డు పరిధిలో మృతి చెందిన షేకున్‌బి కుటుంబ సభ్యులు మాబాష, మహ్మద్‌గౌస్‌లకు శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్‌ఏ శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో సచివాలయ సిబ్బంది రవీంద్ర ఆధ్వర్యంలో రూ.10వేలు నగదు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మైనార్టీల అభివృద్ది కోసం పెద్ద ఎత్తున్న కృషి చేసే నాయకుడు ఎంఎల్‌ఏ శిల్పా చక్రపాణిరెడ్డి అని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలలో వైఎస్సార్ బీమా పథకం నిరుపేదలక ఆర్థిక చేయూతను అందించి ఎంతో అండగా నిలచిందని తెలియజేశారు. మున్సిపల్ కమీషనర్ పెనుకొండ శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## తెలుగుకు వెలుగు .. గిడుగు..

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు భాషను ప్రేమించి ఆరాధించే ప్రతి ఒక్కరి హృదయాల్లో గిడుగు రామ్మూర్తి చిరస్థాయిగా నిలిచిపోతారు.. ఇదిలా ఉండగా తండ్రికి తగ్గ తనయుడన్నట్లు రామ్మూర్తి కుమారుడు గిడుగు సీతాపతి మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదించి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ కళాప్రపూర్ణ బిరుదులు పొంది శబాష్ అనిపించుకున్నారు..

**సాహితీవేత్తల తెలుగు మమకారం:–** తెలుగు భాషలోని నుడికారాలు, సామెతలు, పర్యాయపదాలు ఒక్కటేమిటి తెలుగుతల్లి కీర్తిని, భాషా వైభవాన్ని తమ సాహితీ పటిమతో ఎందరో కవులు రచించి భాషాసేవలో పునీతులయ్యారు.. తెలుగు వారికి మొట్టమొదటి జ్ఞానపీఠ పురస్కారాన్ని అందించిన ప్రతిభామూర్తి కళాప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ తన స్వరానికి నిచ్చెనలులో తెలుగు లిపిని విశిష్టతను, తెలుగు వ్యావహారిక పితామహుడు గిడుగు రామ్మూర్తి దేశభక్తి అంటే నా దృష్టిలో మాతృభాష మీద అభిమానమే అని, జాతిపిత గాంధీజీ విద్యార్థి మాతృ భాషలో విద్యనభ్యసించడం ద్వారా పరిపూర్ణత సాధించగలమంటూ.. వీరితో పాటు అరవింద్ ఘోష్, కొఠారి కమిషన్, విశ్వనాథ సత్యనారాయణ తన వేయి పడగలులోని ధర్మారావు పాత్ర ద్వారా, పానుగంటి లక్ష్మీనరసింహ తన వ్యాసాల ద్వారా, రాయప్రోలు సుబ్బారావు, మహాకవి జాషువాతో పాటు మార్క్ టుల్లీ వంటి పాశ్చాత్యులు సైతం మాతృభాషా విశిష్టతను, తెలుగుభాష వైభవాన్ని తమదైన శైలిలో విశదపరిచారు.. ఏ భాష పదాన్నయినా తనలో ఇముడ్చుకోగలిగిన ఉదార స్వభావి అయిన తెలుగు భాష పరిరక్షణలో కేవలం తెలుగు భాషా దినోత్సవం వేడుకలు మొక్కుబడిగా గాక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధికారులు, సాహితీవేత్తలు, తల్లిదండ్రులు భాషాభిమానులు చిత్తశుద్దితో నిరంతరం కృషి చేసినప్పుడే తెలుగు భాషకు పునర్వైభవం పరిఢవిల్లగలదు..

**తియ్యనైనది తెలుగుభాష:** తెలుగు అమ్మలాంటి కమ్మనైన పదం.. మనిషి తన మనసులోని భావాలను, ఆలోచనలను వ్యక్తీకరింపజేసేది భాష,, అటువంటి అనేక రకాలైన భాషలలో మధురమైన తెలుగు భాష ప్రత్యేకతే వేరు.. అదే విధంగా తెలుగుతల్లి రూపం, జాతి ఔన్నత్యానికి, భాష నిండుదనానికి సంకేతం.. అమ్మకన్న విలువైనది అవనిలో లేదు.. తెలుగుభాష తియ్యదనం తేనెకైనా రాదు అంటూ ఎన్నో కలాలు తెలుగు మాధుర్యాన్ని చవి చూపించాయి.. సాహిత్య సమరాంగణా సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయులు దేశ భాషలందు తెలుగు లెస్సా అని, వెనీస్ వర్తకుడు నికోలో డికాంటే తెలుగును ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్‌గా అభివర్ణిస్తూ చేసిన కీర్తి ప్రశంసలు తెలుగు తల్లి సిగలో నెలవంకలై ఏ నాటికీ అలారారుతూనే ఉంటాయి..ఇక భారతదేశంలోని ప్రాంతీయ భాషలలో తెలుగు మాతృభాషగా మొదటి స్థానంలోనూ, ప్రపంచంలోని అత్యధికంగా ప్రజలు మాట్లాడే ప్రధాన భాషల్లో 15వ స్థానంలోను అలరారుతున్న దన్నడంలో అతిశయోక్తి లేదు.. దేశంలోని అతి ప్రాచీన భాషలైన సంస్కృతం, తమిళంతో పాటు భారత ప్రభుత్వం 2008 అక్టోబర్ 31న తెలుగును ప్రాచీనమైన భాషగా గుర్తించింది..తెలుగు భాష అవశ్యకతను ప్రతి ఒక్కరికి చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో ఏర్పడినదే తెలుగు భాష దినోత్సవం..గిడుగు రామ్మూర్తిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి రచయిత, కవి, తెలుగు అభిమాని తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేయాలి..

## జింకలబారి నుంచి పంటలను రక్షించండి సారూ....

**కౌతాళం, ఆగస్టు28, ప్రభాతవార్త ;** మండలంలోని అన్ని గ్రామాల్లో జింకలు పొలాల్లో ఒదలుమందలుగా తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయని, జింకలబారి నుంచి పంటలను కాపాడాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. స్పందనలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యేడాది జూన్ నెలలో రావాల్సిన వర్షాలు జూలై చివరిలో రావడం వల్ల రైతులు నెలరోజులు ఆలస యగా విత్తనా సాగు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలో వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయి జానెడు ఎత్తు కూడా లేవన్ననరు. ఆ పంటలను జింకలు మొత్తం తినేస్తున్నాయన్ననరు. పత్తి, వేరుశనగ, మిరప, కంది, జొన్న, సజ్జలు, కొర్రలు, ఇతర ఏ పంటలు వేసినా జింకలు పూర్తిగా తినేస్తున్నాయన్నారు. రైతులు పంటలు కాపాడుకోవడానికి కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధిఆరులు స్పందించి జింకలను అదుపు చేసేందుకు ఫారెస్టు అధికారుల సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఉలిగయ్య, నారాయణ, వెంకోబా, వీరేష్, సత్యప్ప, వలీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కు భారతరత్న బిరుదు ఇవ్వాలి

**–రూ.100 నాణ్యం విడుదల సందర్భంగా టీడీపీ సంభరాలు**

**గోనెగండ్ల ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జాతీ గర్వించదగిన రాజకీయ నాయకుడని తెలుగు జాతి ఖ్యాతీని ప్రపంచానికి చాటిన మహనీయుడని ఆయనకు భారతరత్న ఆవార్డు ఇవ్వాలని గోనెగండ్ల మండల టీడీపీ కన్వీనర్ నజీర్‌సాహెబ్,ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు,టౌన్ అధ్యక్షుడు రమేష్‌నాయుడు,భారతం రహంతుల్లా,నూరఅహ్మద్,బేతాళ బడేసాహెబ్, కేంద్ర ప్రభుత్వంను కోరారు.సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో టీడీపీ పార్టీ జెండాను ఎగురువేశారు.ఎన్టీఆర్ 100 జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు.మిఠాయిలు పంచుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా రూ.100 నాణ్యంను ముద్రించిందని ఆ నాణ్యంను రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ విడుదల చేసిందన్నారు.దీంతో టీడీపీ నేతలు హర్షవ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.పేదల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో కులుమాల రాముడు,అడ్వకేట్ చంద్రశేఖర్,వెంకటేశ్వర్లు,కొత్తింటి ఫకృద్దిన్,రామాంజినేయులు, మదీనా,ఐరన్‌బండ భాషా, తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్పూర్తితో పెంచిన విద్యుత్ చార్జీలపై పోరాటం

**దేవనకొండ,ఆగస్టు 28,ప్రభాతవార్త :** 2000లో నాటి నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇష్టానుసారంగా ప్రజలపై వేసిన విద్యుత్ భారాలకు నిరసనగా 28న ఆగస్టు 2000న జరిగిన చలో అసెంబ్లీ పోరాటం స్పూర్తిదాయకమని ఈ పోరాటంలో అసువులు బాసిన పోరాట యోధులకు నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించడమే నివాళి అని సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్ పేర్కొన్నారు. విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయం నందు సంస్మరణ సభ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేస్తున్న ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సిపిఎం చేసే సమరశీల పోరాటాలలో ప్రజలు,ప్రజాస్వామ్యవాదులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం,ప్రజాసంఘాల నాయకులు ఎం రంగన్న,వై రంగన్న,బండ్లయ్య,మహేంద్ర, బలరాముడు,రామాంజిని, కుమార్, మహేష్,కాంతయ్య,రాజు,రాముడు తదితరులు పాల్గొన్నారు.

## మూడవ రోజు ఎస్సై అభ్యర్థుల ఈ వెంట్స్



**కర్నూలు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ 2 వ బెటాలియన్ లో మూడవ రోజు దేహదారుడ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ రోజు 800 మంది అభ్యర్దులను పిలిచారు. కాని 541మంది అభ్యర్దులు హజరయ్యారు. ఎస్సై మెయిన్స్ ఫైనల్ పరీక్ష కు ఈ రోజు 383 మంది ఎంపికయ్యారు. కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌లు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను పర్యవేక్షించారు. దేహదారుడ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, లేటెస్ట్ కుల ద్రువీకరణ సర్టిఫికెట్ , క్రిమిలేయర్ సర్టిఫికెట్ , ఆధార్, అడ్మిట్ కార్డు, స్టడీ, మార్కులిస్టులు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ సర్టిఫికెట్లు ( గెజిటెడ్ సంతకంతో ) తప్పనిసరిగా తీసుకుని రావలెనని జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు.

## శ్లోకా స్కూల్ ఆధ్వర్యంలో

## చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

**నందికొట్కూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్లోకా సిబిఎస్ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ -3 విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్లోకా విద్యార్థులు పాఠశాల నుండి జాతీయ జెండాలు చేపట్టి స్కేటింగ్ చేస్తు జై ఇస్రో జై భారత్, జై చంద్రయాన్-3 అంటే నినాదాలు ర్యాలీ చేసి పటేఏల్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి చంద్రయాన్ -3 విజయవంతం కావడానికి భారత శాస్త్రవేత్తలు చేసిన కృషిని సంభాషణ రూపంలో విద్యార్థులు కొనియాడారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతు ముందుగా మన భారతదేశ శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలుపుతు విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకొని మన దేశాన్ని అన్ని రంగాలలోను ప్రగతి పథంలో నడిపేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడుతూరు ఎస్సై మారుతిశంకర్, పాఠాశాల కరస్పాండెంట్ డా.జె.శ్రీనువాసరెడ్డి, డైరెక్టర్లు కవిత, శ్రీదేవిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హాకీలో డబుల్ క్రౌన్ సాధించిన గార్గేయపురం జట్టు

**కర్నూలు రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన అండర్-16 బాలుర, బాలికల హాకీ షూట్‌ఔట్స్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గార్గేయపురం జట్టు బాలురు మరియు బాలికలు విన్నర్స్‌గా నిలిచారు. గార్గేయపురం బాలుర జట్టు మునగాలపాడుపై 3-2గోల్స్‌తోను ఫైనల్స్‌లో మున్సిపల్ పాఠశాలపై 4-2గోల్స్‌తో విజయం సాధించింది. బాలికల విభాగంలో ఫైనల్స్‌లో మున్సిపల్ జట్టుపై 4-3తో గార్గేయపురం బాలికల జట్టు విన్నర్స్‌గా నిలిచింది.

## దేవనకొండలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

**దేవనకొండ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన దేవనకొండలో శ్రీ శౌర్య ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథులుగా మండల జడ్‌పిటిసి రామకృష్ణ(కిట్టు), ఎస్ఐ భూపాలుడు, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, ఎంపిపి భర్త లుముంబా, చిట్టెం నాగేష్, ఇండియన్ గ్యాస్ ఏరియా మేనేజర్ యశ్వంత్‌రెడ్డి, డోన్ హెచ్‌పి గ్యాస్ ఎండి విశ్వమోహన్‌రెడ్డి, అశోక, ఉమెన్స్ కాలేజ్ చైర్మన్ కె అశోకవర్ధన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఇంచార్జ్ ఏఈ నారాయణస్వామి నాయక్, మాజీ ఎంపిటిసిలు నరసరావు, రామారావునాయుడులు హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభించడం శుభపరిణామమన్నారు. మండలంలో ప్రతి ఒక్క ఇంటికి డోర్‌డెలివరి చేయడం కస్టమర్లకు ఎంతో సులభంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ సిబ్బంది శ్రీనివాసులు, వైసిపి నాయకులు ప్రతాప్, కప్పట్రాళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## విజయమ్మను పరామర్శించిన పత్తికొండ ఎమ్మెల్యే

**తుగ్గలి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స నుండి విశ్రాంతి తీసుకుంటున్న స్వర్గీయ ప్రహ్లాదరెడ్డి సతీమణి ఉప్పర్లపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు విజయమ్మను పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ తుగ్గలిలోని వారి స్వగృహం నందు పరామర్శించారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని గాయపడిన వారికి భగవంతుడు మంచి ధైర్యాన్ని ప్రసాదించాలని త్వరగా కోలుకోవాలని అన్నారు. వైసిపి సీనియర్ నాయకుడు శ్రీనివాసు లురెడ్డి, పార్టీ జిల్లా ఎగ్జిక్యుటివ్ మెంబర్ తుగ్గలి మోహన్‌రెడ్డి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోసంరక్షణ నిధికి దాత లక్ష విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు 28, ప్రభాతవార్త :** శ్రీశైలదేవస్థానం ఆద్వార్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణశాలకు నెల్లూరు వాస్తవ్యులు అరుందతి అనుదాత గొసంరక్షణ నిధికి సోమవారంనాడు రూ.1,08,000/-లను విరాళంగా పర్యవేక్షకులు నాగరాజుకు విరాళమును అందజేసారు. కాగా విరాళం అందజేసిన దాతను దేవస్థానం తరుపున శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేసారు.

## రాష్ట్ర ప్రజల భవిషత్తుకు గ్యారంటీ

## తెలుగుదేశంపార్టీతోనే సాధ్యం

**పగిడ్యాల, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రాష్ట్రప్రజల భవిషత్తుకు గ్యారంటీ తెలుగుదేశంపార్టీతోనే సాధ్యమని తెలుగుదేశంపార్టీఎస్సీ సెల్ రాష్ట్రఆర్గనైజింగ్ కార ్యదర్శి జయసూర్యఅన్నారు. మాజీ ముఖ్యమంత్రి తెలుగదేశంపార్టీ రాష్ట్రఅధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌పథకాలలో భవిష్యత్తు గ్యారెంటీ ఇంటింటికితెలుగుదేశం అనేనినాదాన్ని నంద్యాల టిడిపార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, మాజీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి ఆదేశాలమేరకు జయసూర్య సోమవారం మండలంలోని లక్ష్మాపురంలో భవిషత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల తెలుగుయువత అధ్యక్షుడు మద్దిలేటిగౌడు, మాజీ గ్రామ ఉపసర్పంచ్ కుమ్మరి గోవిందు, నాగార్జున, తిరుపాలు, నాగేశ్వరరావు, యేసు, అంజి, శిలాడి, రహమతుల్లా, రాజమణి, నరసింహుడు, ముర్తుజావలి, ప్రభుకుమార్, పైజుల, రవిచౌదరి, పైజుల, రవిచౌదరి, కలాం, హేమంత్, పాలబాబు, నాగరాజు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

**పత్తికొండ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** పట్టణంలో ఉన్నటువంటి ఏపి మోడల్ పాఠశాల, కళాశాలలో ఉన్నటువంటి ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పుచ్చకాయల మాడ రోడ్డులో ఉన్న ఏపిమోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు భోధించడానికి ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా అల్తాఫ్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఉపాధ్యాయులను నియమించకపోతే చలో కలెక్టరేట్‌కి పిలుపునిస్తామన్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ వీలైనంత త్వరగా విద్యార్థుల చదువును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులను నియమించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్, మండల అధ్యక్ష కార్యదర్శి సమీర్, శివ, పట్టణ కార్యదర్శి వినోద్, రమేష్, నాయకులు మల్లికార్జున, పవన్, ఉపేంద్ర, మహేష్, రోషన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర చంద్రబాబుతోనే సాధ్యం

:- తెదేపా మాజీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్

**హొళగుంద, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రాష్ట్ర అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆలూరు నియోజకవర్గ టిడిపి మాజీ ఇంచార్ ్జ వీరభద్రగౌడ్ అన్నారు. సోమవారం హొళగుందలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు స్మారక నాణేన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి అరాచకాలు అధికమయ్యాయని 2024ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తదనంతరం హొళగుందకు చెందిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వెంకటేష్ గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈయన వెంట గోవిందుగౌడ్, పంపాపతి, వీరన్నగౌడ్, బసవరాజు, మహేష్, దుర్గాప్రసాద్, అంజి, దిడ్డి వెంకటేష్, లక్ష్మణ్, వీరేష్, పవన్ తదితరులున్నారు.

## వర్షం కోసం 24గంటలు సప్తభజన

**ఆస్పరి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరిలో వర్షం కోసం మూల ఈశ్వర స్వామి ఆలయంలో 24గంటల సప్తభజన చేపట్టారు. సోమవారం స్థానిక దేవాలయంలో ఈశ్వరస్వామికి ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సప్తభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా భక్తులు మాట్లాడుతూ వర్షం కురవాలని ప్రతి ఏడాది శ్రావణమాసంలో సప్తభజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సప్తభజనలో మూడు బృందాలుగా ఏర్పడి సప్తభజన చేస్తామన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయరెడ్డి, వీరేష్, చాపల మహానంది, భక్తులు తదితరులున్నారు.

## మట్టి విగ్రహాలు చిన్న

## పరిమాణంలో ఏర్పాటు చేసుకోవాలి

**కర్నూలు విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్తః** ఏపీ, కర్నాటక రాష్ట్రాలలో నెలకొన్న తీవ్ర వర్షాభావ నీటి పరిస్థితుల దృష్ట్యా గణేష్ మండపాల నిర్వాహకులు విగ్రహాల విషయంలో కొన్ని సూచనలు గమనించాలని గణేష్ మహోత్సవ కేంద్ర సమితి విజ్ఞప్తి చేశారు. రెండు లేదా మూడు అడుగుల ఎత్తుకంటే మించకుండా మట్టి విగ్రహాలు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు వచ్చే సూచనలు కూడ కన్పించడం లేదని తెలిపారు. గతంలో రెండు సార్లు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈవిపత్కర పరిస్థితులు మండప నిర్వాహకులు అర్థం చేసుకొని మట్టి విగ్రహాలు చిన్న పరిమాణంలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

## ఫెవికాల్ వీరులను బదీలి చేయండి....

## ప్రభుత్వ నిధులను కాపాడండి

**నంద్యాల టెక్కె, ఆగస్టు 28, ప్రభాతవార్తః** నంద్యాల జిల్లాలో కొన్ని సంవత ్సరాలుగా ఒకే మండలంలో మండల విద్యాశాఖాధికారులు ఫెవికాల్ వీరులుగా ఉన్నారని వారి వల్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వీరిని వెటనే బదిలీ చేయాలని స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు తాటిమాకుల రాహుల్‌కుమార్‌రెడ్డికి సేవా భారతీ యూత్ రూరల్ సొసైటి అధ్యక్షులు షర్బుద్దిన్ అలీ, వికలాంగుల ఐక్యసంఘం జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, తుపాకుల రమేష్ వినతిపత్రాన్ని అందజేశారు. ఎంఇఓలు 2009 నుంచి ఒకే మండలంలో 10 సంవత ్సరాలకు పైగా కొనసాగుతూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. బడిబాట, బాలకార్మికుల నిర్మూలన, బడిబయట ఉన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన మొబైలైజ్ టీమ్‌లు పనిచేయడం లేదన్నారు. 10 మంది విద్యార్థులు కూడ లేని పాఠశాలలు ఎత్తివేయడం వల్ల డిఎస్సీ ఉపాధ్యాయుల నియామకాలు లేవు అన్నారు. ఒకే మండలంలో కొన్ని సంవత ్సరాలు కొనసాగుతూ వారి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ప్రభుత్వ కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని వారిని వెంటనే బదిలీ చేయాలని కోరారు.

## ప్రభుత్వ హాస్టళ్లకు వార్డెన్‌ను నియమించాలి

**ఆదోనిలీగల్, ఆగస్టు28, ప్రభాతవార్త ;** ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమసయలను పరిష్కరించి, హాస్టళ్లకు వార్డెన్‌లను నియమించాలని పీడీఎస్ఓ పట్టణాధ్యక్షుడు శివ కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో అభివృద్ధి పనులు చేపట్టి, మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో చాలావరకు హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్, మెయింటినెన్స్ చార్జీలను అందించాలన్నారు. నాయకులు వీరేష్, ప్రవీణ్, రంగస్వామి, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎసి ప్రిన్సిపాల్

## నాగస్వామి నాయక్‌పై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్తః** నగరంలోని బి క్యాంపులో ఉన్న ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగస్వామి నాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఎస్ విజయ్‌కుమార్ సోమవారం స్పందన కార్య క్రమంలో ఫిర్యాదు చేశారు. ఈసందర బ్ంగా ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మునిస్వామి మాట్లాడుతూ కర్నూలు నగరంలో వున్న ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎఫ్ఎసి ప్రిని ్సపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థులను అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తు అవహేళన చేసి మాట్లాడడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఇది ఏం సార్ అని అడిగితే వ్యంగ్యంగా నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తు మేం ఏమిచేసినా మీరు నన్ను ప్రశ్నించకుండా ఉంటేనే కళాశాలలో ఉంటారని లేని యేడల టిసిలు ఇచ్చి ఇంటికి పంపుతానని విద్యార్థులను భయభంత్రులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అమా ్మయిలను కూడ విచిత్రమైన బాషలో తిడుతూ కొన్ని సార్లు ఇష్టానుసారంగా ప్రవర్తించడం జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకొని రెగు ్యలర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర నాయకులు రమణ, రవి, కళ్యాణ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో వచ్చిన ఆర్జీలకు సత్వరమే పరిష్కారం

**కర్నూలు మున్సిపల్, ఆగస్టు 28, ప్రభాతవార్తః** కర్నూలు నగర పాలక సంస్థ కమిషనరు భార్గవ్ తేజ అధ్వర ్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. పార్థసారధి నగర్‌కు చెందిన మహేబూబ్ బాష ఇతరులు తమ వీధి యందు మురుగునీరు పోవుటకు సరైన వ్యవస్థ లేనందు దోమలు, పందుల బెడద ఎక్కువగా ఉందని ఈసమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. కృష్ణ కాలనీకి చెందిన మగ్బూల్ ఆహేమ్మద్, ఇతరులు తమ కాలనీ యందు డ్రైనేజి వ్యవస్థ లేదని తమ కాలనీ యందు డ్రైనేజి ఏర్పాటు చేయాలని కోరారు. సంతోష్‌నగర్‌కు చెందిన మౌలా, ఇతరులు తమ వీధి యందు సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా అనేక ఇబ్బందులు పడుతన్నామని పేర్కొన్నారు. సీతారం నగర్‌కుచెందిన నవీన్‌కుమార్ మరియు ఇతరులు తమ వీధి యందు మురుగునీరు పోవుటకు సరైన వ్యవస్థ లేనందున దోమల బెడద ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. సమస్యకు తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఫోర్తుక్లాస్ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన రాజన్న, మరియు ఇతరులు తమ కాలనీ నుండి శ్రీరామ్‌నగర్‌ను కలుపుతూ దారి ఏర్పాటు చేయాల్సిందిగా కమిషనరును అభ్యర్థించారు. ఈరోజు జరిగిన స్పందన కార్యక్రమంలో కర్నూలు నగర్ కమిషనరు భార్గవ్‌తేజ, ఎస్ఈ వేణుగోపాల్, ఇంచార్జ్ సిటి ప్లానర్ మోహన్‌కుమార్, ఎంహెచ్ఓ విశే ్వశ్వర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు మేనేజరు చిన్నరాముడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాల మండలం కానాల గ్రామంలో

## వేళాపాల లేని విద్యుత్ కోతలు

**నంద్యాల రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్తః** నంద్యాలమండలం కానాల గ్రామంలో ప్రతిరోజు వేళాపాల లేని విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దళిత హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షులు ఈ చెన్నయ్య, జిల్లా కార్యదర్శి కొమ్ము ప్రభాకర్‌లు తెలిపారు. కానాల గ్రామంలో డిహెచ్‌టిఎస్ నాయకుల సమావేశంలో చెన్నయ్య, ప్రభాకర్‌లు మాట్లాడుతూ కానాల గ్రామంలో గత మూడు రెండురోజులుగా వేళపాలేకుండా రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా గంట నుండి రెండు గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారన్నారు. ఆదివారం రాత్రి తెల్లవా రుజామున 3 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ రాలేదని అధికారులకు ఫోన్‌చేస్తే పై అధికారులు తీసివేశారు. ఏప్పుడు వస్తుందో ఏ సమయంలో వస్తుందోనని పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ లేకపోవడం ప్రజలు ఉక్కపోతతో అలమటిస్తు మరో పక్క దోమల బెడదతో అల్లాడుతున్నారని దోమలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు దోమకాటుకు గురై ప్రాణాం తకమైన చికెన్ గున్యా, మలేరియా, వంటి వ్యాధుల భారీన పడుతున్నారన్నారు. విద్యుత్ అధికారులు ప్రతి నెలా వేలకు వేలు విద్యుత్ బిల్లులు ముక్కుపిండి వసూలు చేస్తు వినియోగదారులకు అసౌకర్యం కల్పించడం సరికాదని ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు కోత లేకుండా చూడాలని తెలిపారు.

## వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

**వెలుగోడు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇస్తున్న రూ.3వేల నుండి రూ.6వేలకు పెంచాలని వికలాంగుల జిల్లా అధ్యక్షులు కె.గంగాధర్‌శెట్టి డిమాండ్ చేశారు. సోమవారం వికలాంగుల హాక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్తానిక క్రాంతి వికలాంగుల పాఠశాల ఆవరణంలో 28వ వికలాంగుల దినోత్సవం పురస్కారించుకొని జెండావిష్కరణ చేసి సంభరాలు జరుపుకున్నారు. ఈ సంధర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతు ప్రతి వికలాంగుని కుటుంబానికి అంతోదయ కార్డు 35 కేజీల బియ్యం మంజూరు చేయాలని, వివాహం చేసుకున్న ప్రతి జంటకు చదువుతో సంభంధం లేకుండా రూ.లక్ష నుండి 5లక్షలకు పెంచాలని, ఆరు సిలెండర్లు ఉచితంగా ఇవ్వాలని, అప్పె చేసిన ప్రతి వికలాంగునికి మోటారు స్కూటర్లు పంపిణి చేయాలని, ఆర్టీసి బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని, ఇంటి స్థలం మంజూరు చేసి ఇల్లు కట్టివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటి అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యాక్షులు రహంతుల్లా, కార్యదర్శి ఇంతియాజ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

## నేత్రదానంపై విద్యార్థులకు అవగాహాన సదస్సు

**కొత్తపల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో 38వ నేత్రదాన పక్షోస్తవాలలో భాగంగా విద్యార్థులకు నేత్రదానం గురించి అవగాహాన సదస్సు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా.దీపానాగవేణి విద్యార్థులకు వివరించారు. సిహెచ్ఓ బాలకృష్ణ, ఆప్తాలమిక్ ఎస్.ఎ.షేక్షావలి, కెజిబివి ప్రిన్సిపాల్ కృష్ణబాయి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కార్యదర్శి ఎంపికపై హర్షం

**మద్దికెర, ఆగస్టు 28, ప్రభాతవార్త :** వైసిపి పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకి తప్పనిసరిగా ఎప్పటికైనా గుర్తింపు వస్తుందని వైసిపి జిల్లా కార్యదర్శిగా ఎంపికైన మాజీ పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లికార్జున యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అధిష్టానం నన్ని గుర్తించి జిల్లా కేంద్రం పదవిని ఇవ్వడం ఎంతో సంతోషకరమని వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జ రగబోయే ఎమ్మెల్యే ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక సీట్లు వైసిపి సాధించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

**ఎన్నికపై హర్షం :** మల్లికార్జున యాదవ్ వైసిపి జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడంపై జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి, ఎంపిపి అనితయాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ ఎంపిటిసి డిఎస్, పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు, ఇరిగేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కవిరెడ్డి కృష్ణ, గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

## నాగార్జున సిమెంటు జిల్లాకు

## 65 ట్రాఫిక్ బార్‌కేడ్‌లు అందజేత

**నంద్యాల క్రైం, ఆగస్టు 28, ప్రభాతవార్తః** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నాగార్జున సిమెంటు యాజమాన్యం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కావాల్సిన 65 ట్రాఫిక్ బార్‌కేడ్స్ అందజేశారు. జిల్లాలో వివిధ పట్టణాల్లో ముఖ్యమైన కూడలిలో రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలను అపడం వల్ల ప్రయాణించే వాహన సోదకులు మరియు పాదాచారులు చాల ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే ఎక్కువశాతం మానవ తప్పిదాల వల్ల డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కావునా వీటిని నివారించేందుకు పోలీస్‌వారు పాఠశాలలో, కళాశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు, డ్రైవర్లకు, వారున్న ప్రదేశాల్లో ఎన్నోరకాలుగా వివిధ మార్గాలుగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఎక్కువ మంది అవగాహన లోపం అధిక వేగం నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, ఓవర్‌టేకింగ్ తదితర తప్పుల వల్ల ప్రమాదాల బారీనపడడమే కాకుండా ఎదుటివారిని కూడ ప్రమాదాల బారీనపడే అవకాశం ఉందని దీని వల్ల ఎంతోమంది రోడ్డుప్రమాదాల్లో దుర్మరణం పాలవుతున్నారని ఎస్పీ తెలిపారు. నాగార్జున సిమెంటు యాజమాన్యం పోలీస్‌వారికి అందజేయడం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి వెంకటరాముడు, నంద్యాల టౌన్ డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, త్రీటౌన్ సిఐ నరసింహులు, ఆర్ఐ సుధాకర్, ఆర్ఎస్ఐ సోమశేఖర్, నాగార్జున సిమెంటు సీనియర్ మేనేజర్ సాంబశివారెడ్డి, సెల్స్‌ఆఫీసర్ డి కంబగిరి, డీలర్ రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీవ్యాధితో బాధపడుతున్న

## హెచ్ఎంకు ఉపాధ్యాయులు ఆపన్నహస్తం

**పగిడ్యాల, ఆగస్టు 28, ప్రభాతవార్త :** పాలమర్రి పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసిన నాగలక్ష్మి కిడ్నీవ్యాధితో బాధపడుతుంది. ఇటీవల ఆమె భర్త మృతి చెందాడు. దీనికితోడు కిడ్నీవ్యాధి నివారణ చికిత్సకోసం అర్థిక ఇబ్బందులు, మరోకవైపు కుటుంబభారంతో సతమమైపోతున్న అమె సమస్యను చూసినమండలంలోని పనిచేస్తున్న ఉపాధ్యాయులు నాగలక్ష్మికి ఆపన్నహస్తం అందిస్తున్నారు. సోమవారం డైట్‌లెక్చరర్ గోవిందు రూ.10,000లు ఆర్థికసహాయం అదించారు. నాగలక్ష్మికి పూర్తిగా రెండు కిడ్నీలు చెడిపోయాయి. మానవతాదృక్పథంలో ఉపాధ్యాయులు ఆలోచించి ఆర్థికసహాయంఅందించవలసిన ఆవశ్యకత ఎంతైనావుందనీ మండల విదాయశాఖాధికారి సుభాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల విద్యాశాఖాధికారి పైజున్నిసాబేగం, పగిడ్యాల మండల విద్యాశాఖాధికారి సుభాన్, పాఠశాల ఉపాధ్యాయురాలు జయమ్మ, ఐఈఆర్‌టీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

**నంద్యాల విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్తః** రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగుల క్యాడర్ స్ట్రేంత్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మేకల సుబ్బన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 30న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఎపీఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ జేఎసి అధ్వర్యంలో ధర్నాకార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇటీవల కాలంలో పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలుచేయకుండా ప్రభుత్వ అధికారులునిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 1998,2008 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల నియమకాల్లో రిజర్వేషన్లు అమలు చేయకుండా కేవలం మెరిట్ అధారంగా నియామకాలు చేపట్టారన్నారు. పోలీసుల అనుమతితో ఈనెల 30న ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యక్షులు దేవేంద్రుడు, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో జరిగే

## బస్సుయాత్రను జయప్రదం చేయాలి

**ఆలూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని కాపాడుకుందాం..దేశాన్ని కాపాడుకుందాం..అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో జరిగే బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్‌భాష, ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు మునిస్వామిలు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు బస్సుయాత్ర చేపట్టడం జరిగిందని దేశంలో సంపద మొత్తాన్ని ఆదాని, అంబానీలకు దోచిపెట్టే విధానాన్ని ప్రజలందరు గమనించాలని వారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, ఒకే ఒక్క భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని 5కోట్ల ఆంధ్రప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, అధిక ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేవన్నారు. ప్రతి యేటా 2కోట్ల ఉద్యోగాలు విడుదల చేస్తామని మోడీ యువతకు హామీ ఇచ్చి మోసం చేశారని ప్రతి యేటా డిఎస్సిని విడుదల చేసి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని సిఎం జగన్ ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగం ఇవ్వలేకపోయారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సుయాత్ర సెప్టెంబరు 2న ఆలూరుకు వస్తుందని ఆ బస్సుయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని ఘనస్వాగతం పలికి వేదావతి ప్రాజెక్టు నిర్మాణం కోసం జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు శ్రీరంగ, దస్తగిరి, మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, వెంకటేష్ నాయక్, రంగస్వామి నాయక్ మూర్తి, విక్రమ్ ఆదిత్య, వీరేష్, రంగనాయక్ తదితరులున్నారు.

## హాజీరా బీ కుటుంబానికి న్యాయం చేయాలి

**ఆదోని రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు న్యాయం చేయడం లేదని మైనార్టీ బాలిక అత్యాచారం, హత్యకు గురైనా ఎందుకు చర్య తీసుకోలేదని ఇప్పటికైనా హాజీరా బీ హంతకులకు ఉరిశిక్ష వేయాలని ఆదోని ముస్లిం మైనార్టీ నాయకులు ఉమ్మిసలీం డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మహిళలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆదోని డివిజన్‌లోని గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలో హాజీరా బీ అనే మైనార్టీ బాలికపై మూడేళ్ల క్రితం అత్యాచారం, హత్య చేశారని ఇంతవరకు దీనిపై ఎందుకు స్పందించలేదని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో ఒక అగ్రవర్ణ వర్గానికి చెందిన మహిళను అత్యాచారం చేసి హత్య చేస్తే 24గంటల్లోనే అక్కడి ముఖ్యమంత్రి కెసిఆర్ వారిని ఎన్‌కౌంటర్ చేయించారని దీనికి స్పందిస్తూ ఏపి అసెంబ్లీ సమావేశంలో సిఎం జగన్ తెలంగాణ సిఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆంధ్రాలో దిశ అనే చట్టాన్ని తీసుకొచ్చారని అయితే ఆ దిశ చట్టానికి దశ దిశ లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని గోనెగండ్ల మండలంలో మైనార్టీ బాలిక అత్యాచారానికి హత్యకు గురై మూడేళ్లైనా ఇంతవరకు సిఎం ఎందుకు పట్టించుకోలేదని ఆ కుటుంబానికి ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. పొలంలో ఉన్న తండ్రికి క్యారియర్ ఇవ్వడానికి వెళ్లిన హాజీర బీ అదే గ్రామానికి చెందిన నలుగురు అతి దారుణంగా అత్యాచారం హత్య చేస్తే అప్పట్లో అక్కడ ఎస్ఐగా ఉన్న హనుమంతరెడ్డి ఆ కేసును తప్పదారి పట్టించారన్నారు. అందువల్ల ఎస్ఐ హనుమంతరెడ్డిని సస్పెండ్ చేసి హంతకులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఒక ముస్లిం మైనార్టీ మహిళకు జరిగిన అన్యాయంపై తాను శాంతియుతంగా స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పిస్తానని ఇందుకు అనుమతి ఇవ్వాలని స్థానిక డిఎస్పీని కోరితే తనను డిఎస్పీ కార్యాలయం చుట్టూ తిప్పుకుని చివరకు అనుమతి ఇవ్వలేదన్నారు. ఇదే వైకాపా నాయకులు ఎన్ని ర్యాలీలు చేసినా ఎన్ని ప్రదర్శనలు చేసినా అనుమతులు ఇచ్చారని కేవలం స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆజ్ఞతోనే తనకు అనుమతి ఇవ్వలేదని ఇక్కడ అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుందా..లేక రెడ్డి రాజ్యాంగం..నడుస్తుందా..అని ప్రశ్నించారు. ఈ విషయంపై తాను న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని లోకయుక్తకు వెళ్లి డిఎస్పీపై న్యాయపోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మహిళలు సలీం ఆధ్వర్యంలో గాజులు, చీరలను జగన్ చిత్రపటానికి అందచేసి హాజీరాబీకి న్యాయం చేయాలని కోరారు. అలాగే సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందచేశారు.

## వర్షం కోసం ఓంకారేశ్వరునికి జలాభిషేకం

**బండిఆత్మకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్తః** వర్షాలు సకాలంలో కురువాలని పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులకు మంచి దిగుబడులు వచ్చేలా చూడాలని మండలంలోని ఓంకార క్షేత్రంలో వెలసిన శ్రీగంగాఉమా సమేత ఓంకార సిద్దేశ్వరస్వామికి శ్రావణమాసం సోమవారం గ్రామసు ్థలు, రైతులు కలిసి శ్రీగంగా ఉమాసమేత ఓంకారసిద్దేశ్వరస్వామికి ప్రదోశ కాలసమయంలో 108 బిందెలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ పూజారులు, చైర్మన్, గ్రామస్థులు ప్రత్యే ్యక పూజలు నిర్వహించారు.

**వర్షం కోసం శివునికి పూజలు:** బండిఆత్మకూరులో శివాలయ కమిటీ అధ్వర్యంలో వర్షం పడాలని గ్రామస్థులందరు కుందూనది నుండి బిందెలతో నీరుతీసుకువచ్చి నీటితో నిండిన కలశాన్ని ఎత్తుకొని ఆలయ ప్రదక్షణలు చేసి శివాలయంలో గర్బగుడిలో ఉన్న శివలింగం పూర్తిగా మునిగేవరకు నీటితో జలాభిషేకం శివగంగ పూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యే ్యక పూజలు చేశారు. కరువుకాటకాలు, వర్షాలుపడనప్పుడు ఈవిధంగాగ్రామసు ్థలు కుందూనది నుండి శివునికి జలాభిషేకం చేయడం అనవాయితీగా వస్తుందని గ్రామస్థులు తెలిపారు. అనంతరం వర్షాలు పడి పంటలు పండాలని గ్రామస్థులు తమ మొక్కులు తీర్చుకున్నారు.

## మాతృమరణాలను అరికట్టడానికి,

## నైపుణ్యత పెంచడానికి శిక్షణ కార్యక్రమం

**కర్నూలు అర్బన్, ఆగస్టు 28, ప్రభాతవార్తః** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంపిహెచ్ ప్లాట్ నందు సురక్షిత గర్భస్రావాలపై (కాంప్రహన్సియువ్ అబార్షన్ కేర్)ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల, సామాజిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర బ్ంగా డాక్టరు మాట్లాడుతూ సెప్టిక్ అబార్షన్ వల్ల జరిగే మాతృమరణాలను అరికట్టడానికి వైద్యాధికారుల నైపుణ్యత పెంచడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మాత శిశు సేవల సంరక్షణ నోడల్ అధికారి డా.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈశిక్షణ యందు ఎంపిపి యాక్టు గురించి మరియు సురక్షిత గర భ్స్రావాలు చేయడానికి అవసరమైన మందులు పరికరాలు వసతుల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ అనుపత్రి ప్రసూతి విభాగపు అధిపతి డా.మాణిక్యరావు, అసిస్టెంటు ప్రొఫెసర్, డా.సుగుణ శ్రీ, డా.రత్నకుమారిలు పాల్గొన్నారు.

## సంకల్ప సంపూర్ణ స్వాస్థ్యపై అవగాహన సదస్సు

**ఆదోనిటౌన్, ఆగస్టు28, ప్రభాతవార్త ;** ఆదోని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సంయుక్తగా సోమవారం స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య (ఎస్ఎస్ఎస్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు మనం తినే ఆహారం గురించి, వ్యాయామం, నిద్ర యొక్క ప్రాముఖ్యత, పరిసరాల శుభ్రత, మానసిక ఆరోగ్యం, ఫోన్‌లు, టీవీలు ఎక్కువగా చూడకుండా ఉండడం, ఇలా అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఐఏపీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘునాథ్, ట్రైనర్లు డాక్టర్‌లు హరీష్, సూర్యదాస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, స్థానిక ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ కిరణ్‌కుమార్, అక్షరశ్రీ స్కూల్ యాజమాన్యం ఓబుల్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎపియుడబ్ల్యుజె దీక్షకు మద్దతుగా

## తరలివెళ్లిన ఆత్మకూరు పాత్రికేయులు




**ఆత్మకూరు ఆగస్టు28, ప్రభాతవార్త:** సమాజం పట్ల అన్ని రంగాలలో అవగాహన కలిగిన పాత్రికేయ వృత్తిపై కొందరు రాజకీయ స్వార్థం కోసం జిల్లాలో దాడులు, బెదరింపులకు గురి చేస్తూ అధికారాన్ని అడ్డు పెట్టుకోని ఏకంగా అక్రమ కేసులు బనాయిస్తున్న తీరుపై నంద్యాల జిల్లాలోని ప్రింట్ ఎలాక్ట్రానిక్ మీడియా మిత్రులందరు కలసి కట్టుగా ఉద్యమానికి ఊపిరి పోశారు. నంద్యాల జిల్లాలో నూతనంగా ఏర్పడ్డా ఎపియుడబ్ల్యుజే జిల్లా కమిటి ఆధ్వర్యంలో జరిగిన 7 రోజుల దీక్షకు మండలాల నుంచి నియోజకవర్గాల వరకు పాత్రికేయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తమ మద్దతు కల్పించారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కమిటి సభ్యులు ఖండే శ్యామ్‌సుందర్‌లాలు, ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షులు మదుబాబు, ఎలాక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు చలం బాబు అధ్యక్షతన దీక్షలు ఉధృత్తంగా చేపట్టారు. సోమవారం చివరి రోజు దీక్షకు మద్దతు తెలిపేందుకు ఎపియుడబ్ల ్యజె జిల్లా ఉపాధ్యాక్షులు శ్యామ్, ఎలాక్ట్రానిక్ మీడియా చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు సగినాల రవికుమార్‌ల ఆధ్వర్యంలో ప్రింట్ ఎలాక్ట్రానిక్ పాత్రికేయులు పెద్ద ఎత్తున్న తరలి వెళ్లారు. దీక్షలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. అనంతరం దీక్ష స్థలికి నంద్యాల డిఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎస్సీఎస్టీ విచారణ కమిటి డిఎస్ ్ప రామాంజినాయక్‌లు చేరుకోని దీక్షను విరమించాలని తెలియజేశారు. ఈ సందర్బంగా డిఎస్పీలు మాట్లాడుతూ మహనంది మండలం వార ్త జర్నలిస్టుపై నమోదైన కేసులో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కౌంటర్ కేసు కొట్టివేయడం జరిగిందని తెలిపారు. మే 15న జరిగిన సంఘటనలో వార్త మదు, రాజున్యూస్ మదుగౌడ్‌పై పెట్టిన కేసులను విచారణ చేసి జిల్లా ఎస్పీ ఆదేశాలతో తొలగించడం జరిగిందన్నారు. మదుపై దాడి కేసులో వీరారెడ్డి అతని అనుచరులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇచ్చి డిఎస్పీలు దీక్షలు విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రింట్ ఎలాక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు నాగేశ్వరావు, వెంకటరమణ, బొల్లు ప్రసాద్, వనమాల పుల్లయ్య, మల్లయ్య, సుధాకర్, రాజశేఖర్, వెంకటరమణ, ఎస్‌కే జలీల్, నాగరత్నం, మీడియానాడి రిపోర్టర్ వలిఖాన్, యమని శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మేలు..



**తుగ్గలి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** ప్రతి కుటుంబానికి మేలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రాతన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆ గ్రామ స్థానిక వైసిపి నేతలు మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రాచప్ప, కోఆప్షన్‌మెంబర్ చాంద్‌భాషాల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు వారు డ్రమ్స్, వాయిద్యాల మద్య ఘనస్వాగతం పలికి ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ముందుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రతి ఇంటి వద్ద ప్రజలకు వివరిస్తూ సంక్షేమ లబ్ది వివరాల బుక్‌లెట్‌లను అందచేశారు. అలాగే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఏఏ పథకాల ద్వారా ఎంతెంత లబ్ది చేకూరిందో ఎమ్మెల్యే శ్రీదేవమ్మ వివరించారు. పథకాలపై లబ్దిదారులంతా సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ గడిచిన 4ఏళ్లలో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తెస్తున్న సమస్యలు పరిష్కరించడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రామాల్లో కనీస వసతుల కల్పనకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20లక్షల నిధులు విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వాలు ఏవి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. అనుక్షణం ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్దితో పనిచేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతునిచ్చి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సిఎం చేసుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్, వైస్ వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు హుస్సేన్, ఎంపిపిలు మల్లికార్జునరెడ్డి, ఎర్రనాగప్ప, పగిడిరాయి జగన్నాథ్‌రెడ్డి, అట్ల గోపాల్‌రెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, రాంపల్లి నాగభూషణంరెడ్డి, రామకొండ సుధాకర్‌రెడ్డి, జొన్నగిరి గుంత రఘు, రాతన బసవరాజు, విద్యాకమిటీ చైర్మన్ కోదండ రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు, సీనియర్ మేటి సురేష్, జొన్నగిరి దివాకర్, చెన్నంపల్లి సుభాన్, రంజాని, శవాసి, ముక్కెళ్ల గిడ్డయ్య, వెంకటేష్, లక్ష్మణస్వామి, చిరంజీవి, రాంపల్లి సర్పంచ్ మహీంద్రతో పాటు మరింతమంది వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లెక్చరర్ ఔదార్యం



**నందికొట్కూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పట్టణంలోని సంతపేట పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి కిడ్నీల వ్యాధితో భాధపడుతున్న విషయం తెలిసిన కర్నూలు డైట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న మువ్వా గోవింద్ రూ.10వేలు నగదు ఆర్థిక సహాయం అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం స్తానిక ఎం.ఇ..ఓ. కార్యాలయంలో ఆయన నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఎం.ఇ.ఓ. ఫైజున్నిషాబేగం, పగిడ్యాల ఎం.ఇ.ఓ. సుభాన్, ఉపాధ్యాయులు జయమ్మ, రామకృష్ణ, అరుణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తంగరడోనలో ముగిసిన దశమి ఉత్సవాలు




**ఆస్పరి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తంగరడోనలో కొలువుదీరిన శ్రీ చింతలముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు మూడురోజుల పాటు అత్యంత వైభవంగా జరిగి సోమవారంతో ముగిశాయి. ఉదయం స్వామి వారి ఆలయాల్లో ఆలయ ధర్మకర్త పార్వతి ఆద్వర్యంలో ఆలయ నిర్వాహకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. చింతలాముని, నల్లారెడ్డి స్వాములకు అభిషేకాలు, ఆకులపూజలు నిర్వహించి సాయంత్రం ఆరాధనోత్సవం సందర్బంగా చింతలాముని, నల్లారెడ్డి స్వాములకు ఇచ్చిన పశువులను బలిదానం సమర్పించారు. మూడురోజుల పాటు జరిగిన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. దశాబ్దాల కింద ఇచ్చిన మాట ప్రకారం రాక్షసులకు రాత్రివేళలో పశువులను బలిదానం చేశారు. దీంతో దశమి ఉత్సవాలు ముగిశాయి. ఈ దశమి ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రాత్రి ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, ఎంపిటిసి నరసప్ప, గ్రామపెద్దలు సీతారామిరెడ్డి, వెంకన్న, పులికొండ రంగన్న, సచివాలయ కన్వినర్ రాజన్న, మాబూసాబ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకటేష్, దస్తగిరి, రంగముని, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం గెలిచింది.... రాజకీయం ఓడింది....

- అర్థనగ్న ప్రదర్శనతో దిగివచ్చిన ప్రభుత్వం
- అక్రమ కేసులు ఎత్తివేస్తున్నట్లు డిఎస్పీ ప్రకటన



**నంద్యాల, ఆగష్టు 28, ప్రభాతవార్త:** ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా పనిచేస్తున్న పాత్రికేయులపై పెట్టిన కౌంటర్ కేసుల ఎత్తివేతకు గత వారంరోజులుగా రిలేనిరాహారదీక్షలతో హోరెత్తించారు. ఈనెల 21వ తేదిన అక్రమ కౌంటర్ కేసులపై ఏపీయుడబ్ల్యుజే తరుపున రిలేనిరాహారదీక్షలు ప్రారంభించారు. నిరాహారదీక్షలకు టిడిపి, బిజెపి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, ప్రజా సంఘాలు, మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, న్యాయవాదుల సంఘాలు పెద్ద ఎత్తున దీక్షలకు మద్దతు పలికాయి. గత అరురోజులుగా ఎంతో వ్యయప్రయాసాలకు ఓర్చి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఏపీయుడబ్ల్యుజే నాయకులు, కార్యకర్తలు ఉద్యమాన్ని తీవ్రతరం చేసే ప్రయత్నం చేశారు. జూలై 15న మహానంది గ్రామంలో సచివాలయం దగ్గర శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో ఆయన అనుచరులు వార్త విలేఖరి మధుపై, రాజ్ టివి విలేఖరి మధుగౌడ్‌పై దాడిచేశారు. అయితే దాడి చేసిన అనంతరం పాత్రికేయులు ఇచ్చిన ఫిర్యాదులు స్వీకరించి అంతకుముందే ఎమ్మెల్యే వర్గీయులు ఇచ్చిన తప్పుడు రిపోర్టును తీసుకొని ఇరువర్గాలపై కౌంటర్ కేసులు పోలీసులు కట్టారు. దీనిపై ఎస్పీని, డిఎస్పీని కలిసి పాత్రికేయులు విన్నవించినప్పటికి ఫలితం లేకపోవడంతో రిలేనిరాహారదీక్ష చేపట్టారు. సోమవారం పాత్రికేయులు అర్థనగ్న ప్రదర్శన రిలేనిరాహారదీక్ష చేపట్టారు. దీంతో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అదేశాల మేరకు నంద్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ డిఎస్పీ రామాంజీనాయక్, నంద్యాల డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డిలు దీక్ష శిబిరానికి చేరుకున్నారు. ఎస్సీ, ఎస్టీ డిఎస్పీ రామాంజినాయక్ మాట్లాడుతూ మహానంది సచివాలయం వద్ద జరిగిన సంఘటనలు ప్రస్తావిస్తు వార్త మధు ఇచ్చిన కంప్లైట్ తీసుకొని వీరారెడ్డి అతని అనుచరులపై కేసు నమోదు చేశామని వీరారెడ్డి అనుచరుడు తిరుపతయ్య అనే వ్యక్తి వార్త మధు, రాజ్ న్యూస్ మధుపై కౌంటర్ కేసు ఇచ్చారు. ఇరువురిపై కేసులు మహానంది పోలీస్‌స్టేషన్‌లో నమోదు అయ్యాయి. పాత్రికేయులపై పెట్టిన కేసు తప్పుడు కేసుగా ఇన్విస్టిగేషన్‌లో తెలడంతో కేసును ఎస్పీ అదేశాల మేరకు తీసివేయడం జరిగిందన్నారు. వీరు ఇచ్చిన కంప్లైంట్ మేరకు ఫైనలైజ్ చేస్తు కోర్టుకు చార్జిషిట్ దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. ఎపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖండేశ్యాంసుందర్‌లాల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మధుబాబు, చలంబాబు, ఉస్మాన్‌బాష, జనార్థన్‌రెడ్డి, శశిశేఖర్‌వర్మ, కనకరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఐదు గ్రామాల్లో రూ.2 కోట్లతో మౌలిక వసతులు

### - ఎంపీ డా.సంజీవ్ కుమార్



**కర్నూలు, ఆగస్ట్ 28, ప్రభాతవార్త :** జిల్లాలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన కింద ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో రూ.2 కోట్ల ఎంపీ ల్యాడ్స్ నిధులతో మౌలిక వసతుల అభివృద్ధి కి చర్యలు తీసుకోవాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సంసద్ ఆదర్శ గ్రామ యోజన క్రింద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డా.జి.సృజనతో కలిసి సంబంధిత అధికారులతో కర్నూలు పార్లమెంట్ సభ్యులు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన అమలవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కింద ఎమ్మిగనూరు మండలంలోని దైవందిన్నె గ్రామం, తుగ్గలి మండలంలోని రాతన గ్రామం, ఆస్పరి మండలంలోని యాటకల్లు గ్రామం, పెద్దకడబూరు మండలంలోని దిడ్డి మేకల గ్రామం, కర్నూలు మండలంలోని నిడ్జూరు గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ గ్రామాల్లో ఇప్పటివరకు 141 అభివృద్ధి పనులు మంజూరు కాగా, ఇందులో 111 పనులు పూర్తి కాగా, 15 పనులు పురోగతిలో ఉన్నాయని, 15 పనులు ఇంకా చేయాల్సి ఉందని ఎంపీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఈ 5 గ్రామాల్లో అమలు చేస్తూ, ఆ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు సామాజిక అభివృద్ధి తో ఆదర్శంగా తీర్చిదిద్దితే, మిగిలిన గ్రామాలు కూడా వాటిని స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి చెందుతాయని ఎంపీ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ డా.జి.సృజన మాట్లాడుతూ సన్సద్ ఆదర్శ గ్రామ యోజన ఎంపిక అయిన గ్రామాల్లో సమాజ పురోగతి తో పాటు రోడ్లు, విద్య, వైద్యం తదితర అంశాలకు సంబంధించిన మౌలిక వసతులతో సర్వతోముఖాభివృద్ధి సాధించే విధంగా చార్జ్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు.. ఈ గ్రామాల్లో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రబుత్వాలు అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం ద్వారా ఇతర గ్రామాలు కూడా స్ఫూర్తి పొందుతాయన్నారు..వివిధ శాఖల సమన్వయంతో 4,5 నెలల లోపు అన్ని పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా పూర్తిస్థాయిలో ఈ గ్రామాలు అభివృద్ధి చెందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చార్జ్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా ఈ గ్రామాలను సందర్శించి, సమావేశాలు నిర్వహించి, చిత్తశుద్ధితో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడ్డ గొర్రెల దొంగలు

- -కరెంట్ స్థంభకు కట్టి దేహశుద్ది చేసిన గ్రామస్థులు
- -పోలీసులకు అప్పగించిన ఎన్నెకండ్ల గ్రామస్థులు
- -స్టేషన్‌లో ఫిర్యాదు, విచారణ చేస్తున్న పోలీసులు



**గోనెగండ్ల ఆగస్టు 28 ప్రభాత వార్త :** మండల పరిధిలోని ఎన్నెకండ్ల గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గొర్రెలను దొంగలించేందుకు వచ్చిన దొంగలను గొర్రెల మంద కాపరులు పట్టుకున్నారు. వారిని కరెంట్ స్థంభంకు కట్టి వేసి దేహశుద్ది చేశారు. అనంతరం గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి కి దొంగలను అప్పగించారు. గొర్రెల కాపరులు, ఎన్నె కండ్ల గ్రామస్థులు మాట్లాడుతూ గత కొన్ని వారాలుగా గ్రామంలో రాత్రి పూట గొర్రెల దొంగతనాలు జరుగుతుండేవి. దీంతో ఎంత పగడ్బందీగా కాపు కాచినప్పటికి దొంగలు పట్టుబడేవారు కాదు. అయితే గత వారం రోజుల క్రితం కూడా ఎన్నెకండ్ల గ్రామానికి చెందిన నాలుగు గొర్రెలను దొంగలు దొంగలించారు. దీంతో గొర్రెల కాపరులు సమయం కోసం వేచిచూస్తున్నారు. అయితే సోమవారం తెల్లవారు జామున కడివెళ్ల గ్రామానికి చెందిన చంద్ర, శ్రీను, కౌలుట్లయ్యల తోపాటు మరో ముగ్గురు రెండు ద్విచక్రవాహనాలలో ఎన్నెకండ్ల గ్రామ శివార్లలో ఉన్న గొర్రెల మంద దగ్గరకు వచ్చారు. అక్కడ ఉన్న గొర్రెలను దొంగలించేందుకు ప్రయత్నించారు. అసమయంలో గొర్రెలు అరవడంతో నిద్రనుంచి మేల్కొన కాపరులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆరు మంది దొంగలలో ముగ్గురు పారిపోగా మిగిలిన ముగ్గురు పట్టు పడ్డారు. వారిని కరెంట్ స్థంభంకు కట్టివేసి దేహశుద్ది చేశారు. అనంతరం ఎస్ఐ తిమ్మారెడ్డికి వారిని అప్పగించారు. గత వారం రోజుల క్రితం కూడా ఇక్కడే నాలుగు గొర్రెలను దొంగతనం చేశామని దొంగలు ఒప్పుకున్నారు. అయితే వారు ఎక్కడేక్కడ దొంగతనాలు చేశారు. అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తు పారిపోయిన దొంగలను కూడా పట్టుకునేందు ప్రయత్నిస్తున్నారు. విచారణ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీలో వ్యాపారస్తులు సిండికేట్



**పత్తికొండ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో కూరగాయల వ్యాపారస్తులు సిండికేట్ అయి రైతులను దగా చేస్తున్నారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను మార్కెట్ కమిటీకి అమ్మకానికి తీసుకొస్తే మార్కెట్‌లో వ్యాపారస్తులు కుమ్మక్కై రైతు దగ్గర నుండి సరుకును తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ మార్కెట్‌లో బీరకాయ, పచ్చిమిరప, చిక్కుడు, కాకరకాయ, వంకాయ రకరకాల కూరగాయలు కొనుగోలు జరుగుతున్నాయని పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు విలవిలలాడిపోతున్నారు. విత్తనాలు, ఎరువుల పెట్టుబడులకి సరిపోవడం లేదన్నారు. వ్యాపారస్తులు సరుకును బట్టి రేటు నిర్ణయిస్తున్నారని వ్యాపారులు నిర్ణయించిన ధర ఫైనల్ అవుతుందని రైతులు వాపోయారు. హోల్‌సేల్ 20కేజీల ప్యాకెట్ ధర రూ.250ల నుండి రూ.350ల ధరతో కొనుగోలు చేస్తున్నారని రిటైల్‌లో కేజీ రూ.40ల నుండి రూ.50ల వరకు అమ్ముతున్నారన్నారు. మార్కెట్‌లో మాత్రం రైతుల దగ్గర నుండి ఒక కేజీ రూ.15ల నుండి రూ.20లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దాదాపు మార్కెట్‌లో వ్యాపారస్తులు సగానికి సగం పైగా లాభంతో కొనుగోలు చేస్తున్నారని రైతులను దగా చేస్తూ జేబులు నింపుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్తులు కుమ్మక్కై ధరలు నిర్ణయించడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక 100కు పదిశాతం కమీషన్ల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారని రైతులు వాపోయారు. వ్యాపారస్తులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండ చోద్యం చూస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయమై మార్కెట్‌కమిటీ కార్యదర్శి కార్నలీస్‌ను అడుగ్గా వ్యాపారస్తులు రైతుల దగ్గర నుండి కమీషన్లు వసూలు చేయకూడదని వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వ్యాపారస్తులు కుమ్మక్కై వ్యాపారం చేయకూడదని రైతులు పండిచిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జాడ కనిపించని... వరుణుడు..

### -ఎండుతున్న ఖరీఫ్ పంటలు

**కోవెలకుంట్ల, అగస్టు 28, ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్ ఇక మూడు రోజుల్లో ముగియనుండగా ఎక్కడ చూసిన పచ్చని పైరులతో కళకళలాడాల్సిన పొలాలు నేటికి 30శాతము కూడా సాగు కాక అరకొరగా సాగు చేసిన మిరప, మినుము, పెసర కంది మొక్కలు వర్షపు జాడ కనుచూపు మేరలో కలినింపించక పోవడముతో ఎండు దశకు చేరుకుంటున్నాయి. అప్పులు చేసి ఖరీఫ్ పంటలను రైతులు సాగు చేస్తే వర్షము జాడ కనుచూపు మేరలో వాన జాడ కనిపించక పోవడముతో భూగర్భజాలాలు కూడా పూర్తిగా అడుగంటి పోయాయి. దీనితో వాటి కింద సాగు చేసిన పంటలు ఎదుగు బోదుగు లేక పెరుగుదల అగి పోయిన మొలకలతోనే నిలిచి పోయాయి. దీనితో సాగు చేసి రైతుల చూపు నింగివైపు మళ్లింది. నేతల్లిని నమ్మిని ఎండ నక వానకన దుక్కి దున్ని కష్టపడి సాగు చేసిన పంటల పొలాలు కళ్లఎదుటనే బీటలు బారి ఎండి పోతుండటముతో రైతన్నలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. వరుణుడి కరుణ కోసం కర్షకుల నింగివైపు అశగా చూస్తు నిరీక్షిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల బనగానపల్లె సంజామల, కొలిమిగుండ్ల మండలాల్లో వివిద గ్రామాల్లో ఖరీఫ్‌సీజన్ సంబందించి మొక్క జొన్న, పెసర. మినుము, సజ్జ, కర్ర,



వేరుశనగ, ఉల్లి మిరప, కంది వరి పైర్లు వర్షాదార కింద మరియు అక్కడక్కడ బావుల కింద, బొర్ల కింద పంటలు సాగు చేశారు. ఖరీఫ్ అరంభముతో అశ వరుణుడు అశ చూపడముతో రైతులు ఎంతో ఉత్సాహముతో దుక్కిదున్ని పంటలకు అవసరమైన విత్తనాలను సమకూర్చకుని వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశారు. అయితే సెప్టెంబరు సరి అయిన వర్షాలు కురిపస్తే తప్పన రబీలో పంటలు సాగు చేయడానికి అవకాశము ఉంటుంది. అప్పుడు కూడా వర్షము మొఖము చాటు వేస్తే ఇక రైతులకు అత్మహత్యలే శరణ్యము రైతుల పరిస్థితిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలోచించాలని రైతన్నలు కోరుతున్నారు.

## తలపాగావస్త్రం, రుద్రాక్షల విక్రయం ప్రారంభం

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు28, ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రంలో నూతనంగా శ్రీస్వామివారి తలపాగా మరియు రుద్రాక్షలను భక్తులు కొనుగోలు చేసేందుకు వీలుగా ఆలయ ప్రాంగణములోని కైలాసకంకణాల విక్రయ కేంద్రంలో విక్రయానికి అందుబాటులో ఉంచడం జరిగింది. కాగా సోమవారంనాడు శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న నూతనంగా ప్రారంబించారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి ఈ విక్రయాలను ప్రారంబించడం జరిగింది. దేవస్థానం ఈఓ ఎస్.లవన్న మొదటగా వీటిని స్వయంగా కొనుగోలు చేయడం జరిగింది. ఈక్రమంలోనే స్వామివారి ఈ తలపాగా వస్త్రాన్ని మరియు పంచముఖ రుద్రక్షలు(3 నెంబర్లు)కలిపి ఒక్కింటికి రూ.150/-ల చోప్పున శ్రీస్వామివారి తలపాగా వస్త్రం పేరుతో భక్తుల సౌకర్యార్థం విక్రయానికి అందుబాటులో ఉంచడం జరిగింది. అదే విధంగా కేవలం రుద్రాక్షలు మాత్రమే కోరుకునే భక్తుల సౌకర్యార్థం మూడు ముఖాల రుద్రాక్షలు(3నెంబర్లు)కలిగిన పాకెట్‌ను ఒక్కింటికి రూ.50/-లతో భక్తులకు అందుబాటులో ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామివారి ఆలయ ప్రధానార్చకుల శివప్రసాద్ స్వామి, ఆలయ సహయ కార్యనిర్వహణాదికారి ఐ.ఎన్.వి.మోహన్, స్వామివారి ఆలయ ఉపప్రధానార్చకులు శివశంఖరస్వామి, ఆలయ కార్యాలయ పర్యవేక్షకురాలు పి.దేవిక, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంపై డేగ కళ్లతో వెంటాడండి

### -"ఐ" టీడీపి సభ్యులకు జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు పిలుపు



**కర్నూలు న్యూసిటి, ఆగష్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న అవినీతి అక్రమాల ప్రజా వ్యతిరేఖ విధానాలపై "ఐ" టిడిపి సభ్యులు వెంటాడి బయట పెట్టి ప్రజలకు వివరించాలని కర్నూలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు సభ్యులకు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా టిడిపి పార్టీ కార్యాలయంలో ఐ టిడిపి అధ్యక్షులు గట్టు తిలక్ అధ్యక్షతన జరిగిన టిడిపి విస్తృత స్థాయి సమావేశానికి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఐ టిడిపి ట్రైనర్ వరుణ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ఐ టిడిపి సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ యంత్రాంగం మొత్తం కూడ ఐటిడిపి పై అధారపడి ఉందని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడంలోను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నాయకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తెలియజెప్పడంలో కీలక భూమిక పోషిస్తున్న ఒక్క ఐటిడిపియేనని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మన నాయకులను అడ్డమైనకేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఐ టిడిపి సభ్యులు అఖీల్, క్రిష్ట, రాఘవేంద్ర, రామాజనేయులు, నాగరాజు, సోలమన్‌రాజు, వివిధ నియోజకవర్గాల నుండి 200 మంది వరకు ఐటిడిపి సభ్యులు హాజరయ్యారు.

## మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం



**ఆళ్లగడ్డ, ఆగష్టు 28, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో మద్యం(ఎక్సైజ్ సారాయి) కేసులలో పటుబడిన వాహనాలు డిఎస్పీ బి వెంకటరామయ్య అధ్వర్యంలో బైకులు, కారు, ఆటోలు మొదలైన వాటిని ఆళ్లగడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్ అవరణలో 29వ తేది ఉదయం 10 గంటలకు పోలీస్ వారి అధ్వర్యంలో వేలంపాట వేయనున్నారు. వేలం పాటలో గెలుపొంది వాహనం దక్కించుకున్న వ్యక్తి వారు పాడిన వేలం పాట యొక్క డబ్బులతో పాటు జిఎస్‌టి కూడ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కొరకు ఆళ్లగడ్డ డిఎస్పీ కార్యాలయం నందు సంప్రదించాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో పత్రాలు సరిగా లేని వాహనాలు స్వాధీనం: సోమవారం తెల్లవారుజాము నుండి ఆళ్లగడ్డ డిఎస్పీ అధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు నలుగురు సిఐలు, 8 మంది ఎస్ఐలు, 100 మంది సిబ్బంది ఆళ్లగడ్డ టౌన్‌లోని రామలక్ష్మీ కొట్టాల నందు కార్డన్ సెర్చ్ నిర్వహించి పత్రాలు సరిగా లేని 42 టూ వీలర్స్ వాహనాలు, ఒక ట్రాక్టర్, ఒక బోలేరా వాహనం, ఒక బల్లెం, అనుమానితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలి



**నంద్యాల హాస్పటల్, ఆగష్టు 28, ప్రభాతవార్త:** ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఆర్ వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం మహిళా ప్రాంగణంలో ఇటీవల నియమితులైన ఆశా కార్యకర్తల 13 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ శిక్షణ పొందిన కార్యకర్తలకు మీకు చాల ఉపయోగకరమైన పూర్తిస్థాయి అంశాలపై శిక్షణ అందించారని వీటిని సద్వినియోగం చేసుకోసుకొని ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. మాత శిశు మరణాలను తగ్గించడంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగే విధంగా చూడాలని కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు ఇచ్చి సరైన వివాహ వయసుపై అవగాహన కల్పించాలన్నారు. నవజాత శిశువుల గృహ సందర్శన చేసి వారికి ఇచ్చిన హెచ్‌బిఎన్‌సి కిట్లను ఉపయోగించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఏవైనా అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే వెంటనే చిన్నపిల్లల ఆరోగ్య అత్యవసర విభాగాలకు రెఫర్ చేసి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి మల్లిఖర్జునరెడ్డి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రతి బుధవారం, శనివారం జరుగుచున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో గర్భవతులకు, మరియు పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల లోపు పిల్లలకు వేసిన ప్రతి వ్యాధి నిరోధక టీకాల వివరాలను వెంటనే యూవిన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని అదేశించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిని ప్రతిభ, డిసిఎం వీరన్న, ఆరోగ్య బోధకురాలు స్వర్ణ, ఆరోగ్య పర్యవేక్షకురాలు సరళగంగలు పాల్గొన్నారు.

## ఉరుకుంద క్షేత్రానికి పోటేత్తిన భక్తులు..



**కోసిగి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** ప్రసిద్ది పుణ్యక్షేత్రమైన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిదికి భక్తులు పోటేత్తారు. శ్రావణ మాసంలో స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన సోమవారం భక్తులు పలు వాహనాల్లో కోసిగి మీదుగా తరలి వెళ్లారు. దీంతో కోసిగిలోని ఉరుకుంద రహదారిలో రైల్వే ట్రాక్ సమీపంలో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ అస్థవ్యస్థంగా మారింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఎక్కడ చూసిన వాహనాల వరుసలతో రహదారి పూర్తిగా నిండి పోయింది. అంతేకాక ప్రమాదాలు జరిగే అవకాశం ఏర్పడింది. ఉరుకుందుకు వెళ్లేందుకు వస్తున్న వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేసారు.. దీంతో స్థానిక బస్టాండ్ నుండి ఉరుకుందకు వెళ్లే రహదారి ఆర్చి వరకు పోలీసులు ట్రాఫిక్‌ను రహదారిలో నిలిచి పోయిన వాహనాలను నియంత్రించారు... ముందుగా ఎక్కడ కూడా వాహనాలు ఢీ కొట్టకుండా జాగ్రత్తలు తీసుకుని ఒక్కొక్క వాహనాన్ని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. కోసిగి మీదుగా ఉరుకుంద క్షేత్రానికి వెళ్లే వాహనాల రహదారిని హాల్వి వైపు మల్లించారు. అలాగే ఉరుకుంద నుండి వచ్చే వాహనాలను నేలకోసిగి మీదుగా కోసిగికి మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది. వాహనాలు సులభంగా రాకపోకలు జరగడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా కోసిగిలో రైల్వే ట్రాక్ ఉండడంతో రైలు వచ్చే సమయంలో గేట్లు వేస్తుండడంతో ట్రాఫిక్ కంట్రోల్ కాలేక సతమతమయ్యారు..అయినప్పటికి పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ప్రయాణికులు, భక్తులు కాస్తా ఊపిరి పీల్చుకున్నారు..

## చట్టపరిధిలో బాధితులకు న్యాయం : జిల్లా ఎస్పీ



**నంద్యాల క్రైం, ఆగష్టు 28, ప్రభాతవార్త:** చట్ట పరిధిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రమైన ఎస్పీ కారా్యలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి పోలీస్‌స్పందనకు 140 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అధికారులతో చట్టపరిధిలో ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదేశించారు. ఫిర్యాదులను మళ్లి పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ హెచ్చరించారు. స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్‌లో మాట్లాడి అదేశాలు జారీచేశారు. స్పందనలో ఎక్కువగా సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తిపంపకాల్లో మనస్పర్థలు, అత్తారింటి వేధింపులు మొదలైనవి వచ్చాయి. కొన్ని వివరాలను ఆయన వెల్లడించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్బీడిఎస్పీ జెవి సంతోష్‌లు ఉన్నారు.